

సీఎం పర్యటన సందర్భంగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్


2న 'గూడేని'కి సీఎం

- ఖరారైన రేవంత్‌రెడ్డి పర్యటన
- ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం అనంతరం బహిరంగ సభ
- నేడు ఏర్పాట్లను పరిశీలించనున్న మంత్రి తుమ్మల

కొత్తగూడెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు జిల్లాల పర్యటన చేపట్టారు. ఈ క్రమంలో డిసెంబరు 2న ఆయన కొత్తగూడెంలోని ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి హాజరుకానున్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు. కాగా ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీని సీఎం చేతులమీదుగా ప్రారంభించాలని చాలారోజులుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. 2న సీఎం జిల్లాకు రానున్న నేపథ్యంలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో వారం రోజుల నుంచే పనులను ప్రారంభించారు. యూనివర్సిటీకి ఏర్పాటు నుంచి మొదలుకుని మౌలిక సదుపాయాల కల్పన విషయాల వరకు అన్ని పనులను మంత్రి తుమ్మల పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలోనే గత వారం సీఎం పర్యటన ఖరారైన వెంటనే అధికారులను పనులు ప్రారంభించాలని ఆదేశించడంతోపాటుగా.. ఆయనే స్వయంగా వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు. ఇక సీఎం పర్యటన అధికారికంగా ఖరారైన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. యూనివర్సిటీలో (మిగతా 6వ పేజీలో)

జిల్లాలో ఉన్న ఏకైక భారీ పరిశ్రమ గ్రానైట్ పరిశ్రమ. ఒకప్పుడు బ్లాక్ గ్రానైట్ ఉత్పత్తులు ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసిన ఇక్కడి పరిశ్రమలు నేడు ముడిసరుకులేక మూతపడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 550 వరకు స్లాబ్ గ్రానైట్ పరిశ్రమలు, 220 వరకు గ్రానైట్ టైల్స్ పరిశ్రమలుండగా.. నేడు 250 గ్రానైట్ స్లాబ్ పరిశ్రమలు, 60 గ్రానైట్ టైల్స్ పరిశ్రమలున్నాయి. అవి కూడా అంతంత మాత్రంగానే నడుస్తున్నాయి.

దీనికి కారణాలు అనేకం ఉన్నా ముఖ్య కారణం మాత్రం గ్రానైట్ క్వారీల లీజులు తగ్గడమే. ఈ పరిశ్రమపై లక్షలాది మంది కార్మికులు జీవనం సాగేది. తెలుగు రాష్ట్రాలతో పాటు రాజస్థాన్, గుజరాత్, ఒడిస్సా, బెంగాల్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తదితర రాష్ట్రాల కార్మికులు ఖమ్మంలోని గ్రానైట్ పరిశ్రమలలో పనులు నిర్వహించేవారు. కాని ప్రస్తుతం ఖమ్మం జిల్లాలోని కార్మికులకు పని దొరకని పరిస్థితి.



మూతపడిన ఓ గ్రానైట్ ఫ్యాక్టరీ

ముడిసరుకు లేక..

- మూతపడుతున్న గ్రానైట్ పరిశ్రమ
- నల్లరాయి క్వారీలకు అనుమతుల అడ్డంకి
- వివిధ కారణాలతో నిరాకరిస్తున్న అధికారులు
- గతంలో 315.361 హెక్టార్లలో తవ్వకాలు.. ప్రస్తుతం 100 హెక్టార్లకే పరిమితం
- పడిపోతున్న గ్రానైట్ ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు

ఖమ్మం ఖానాపురం హవేలీ, నవంబరు 28 : గతంలో ఉన్న ముడిసరుకు గ్రానైట్ ఉత్పత్తిలో ఖమ్మం జిల్లా ఉమ్మడి రాష్ట్రం లోనే అగ్రస్థానంలో ఉండేది. అలాంటిది. రాష్ట్ర విభజన తర్వాత మరింత ఊపందుకోవాల్సింది పోయి రోజురోజుకు దిగజారి పోతోంది. గ్రానైట్ క్వారీల లీజుల విషయంలో ప్రభుత్వం వివిధ కారణాలు చూపుతూ అనుమతులు ఇవ్వకపోతుండటంతో వ్యాపారులు, కార్మికులు జిల్లా నుంచి భారీగా ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారు. ఫలితంగా గ్రానైట్ రంగం కుదేలవుతోంది. దశాబ్దాలుగా తవ్వకాలు జరుగుతున్న క్వారీలకు సమీపంలోని భూములను సంక్షేమ కార్యక్రమాల కోసమని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుండం. గ్రానైట్ పరిశ్రమకు శరాఘాతంగా మారింది.

గతమెంతో ఘనం..

గ్రానైట్‌కు కేంద్ర బిందువుగా ఉన్న జిల్లాలో కాలక్రమేణా తవ్వకాలు తగ్గిపోవడంతో ఆ ప్రభావం స్థానిక అభివృద్ధిపై పడి.. ఉపాధి అవకాశాలు లేక కార్మికులు ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు. 2000 సంవత్సరానికి ముందు ఖమ్మంజిల్లాలో 200క్వారీలకు పైగా ఉండగా. ప్రస్తుతం వాటి సంఖ్య 40కు పడిపోయింది. ప్రభుత్వ ఆధీనంలోని 188.43 హెక్టార్ల భూమిలో, 148,928 హెక్టార్ల పట్టాదారు (ప్రైవేట్) భూమిలో క్వారీలు నడిచేవి. అంటే మొత్తం ప్రభుత్వం, ప్రవేటు కలిసి 315,361 హెక్టార్లలో గ్రానైట్ క్వారీలకు లీజులు ఉండేవి కానీ 21ఏళ్ల గడిచే సరికి ప్రస్తుతం ప్రభుత్వ ప్రైవేట్ కలిపి మొత్తం 100హెక్టార్లలో మాత్రమే గ్రానైట్ లీజులు నడుస్తున్నాయి. అంటే మొత్తం మూడు వంతుల్లో రెండు వంతుల వ్యాపారం తగ్గిపోగా, 214 హెక్టార్ల భూమిలో గ్రానైట్ తవ్వకాలు నిలిచిపోయాయి.

పలు కారణాలతో అనుమతులు రద్దు..

ప్రభుత్వం పల్లెప్రకృతి వనాలు, పేదలకు ఇళ్ల ప్లాట్లు, డబుల్ బెడ్రూం (మిగతా 8వ పేజీలో)

జోగ్గూడెం సర్పంచ్ @ రూ.20లక్షలు

- దక్కించుకున్న కాంగ్రెస్ మద్దతు దారు
- రూ.5వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొన్న ఏడుగురు ఆశావహులు
- ఆ డబ్బుతో గ్రామంలో ఆంజనేయ ఆలయ నిర్మాణం

కామేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్ పదవిని వేలంపాటలో రూ.20లక్షలకు దక్కించుకున్నారు ఓ మహిళా అభ్యర్థి. ఈ సంఘటన ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం జోగ్గూడెం గ్రామంలో జరిగింది. శుక్రవారం జోగ్గూడెం గ్రామంలో గ్రామస్థులు, వివిధ పార్టీ నాయకులంతా సమావేశమయ్యారు. ఎనిమిది వార్డుల్లో.. మొత్తం 725ఓటర్లున్న జోగ్గూడెం గ్రామ సర్పంచ్ పదవి ఎస్టీ మహిళకు రిజర్వ్ అయింది. ఈ క్రమంలో సర్పంచ్ పదవిని వేలం వేసి వచ్చిన డబ్బుతో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మించుకుందామని నిర్ణయం తీసుకున్నారు. వేలం పాట పెట్టి ఎవరు ఎక్కువ పాడితే వారికే సర్పంచ్ పదవిని అప్పజెప్పాలని నిర్ణయించారు. ఈ క్రమంలో వేలంపాటలో పాల్గొనే వారు ఒక్కొక్కరు రూ.5వేలు డిపాజిట్ చేసి పాల్గొనాలని గ్రామపెద్దలు సూచించడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన ఏడుగురు ఆశావాహులు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నారు. రూ.5లక్షల నుంచి (మిగతా 6వ పేజీలో)

రెండోరోజు ఉత్సాహంగా..

- జిల్లాలో సర్పంచ్‌లకు 157.. వార్డులకు 325 మంది నామినేషన్లు
- నేడు ముగియనున్న తొలివిడత దాఖలు ప్రక్రియ
- రేపు రెండోవిడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో నోటిఫికేషన్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా తొలివిడత ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీల్లో రెండోరోజు నామినేషన్ల కార్యక్రమం ఊపందుకుంది. శుక్రవారం పలు గ్రామాల్లో అభ్యర్థులు ఉత్సాహంగా తమ నామినేషన్లను దాఖలు చేశారు. తొలివిడత ఎన్నికలు జరిగే 7మండలాల్లో 192 గ్రామపంచాయతీల్లో రెండోరోజైన శుక్రవారం సర్పంచ్ స్థానాలకు 157నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక 1,740 వార్డు స్థానాలకుగాను 325 నామినేషన్లు దాఖలయ్యాయి. శనివారం నామినేషన్ల స్వీకరణకు చివరిరోజు కావడంతో భారీగా వచ్చే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే తొలిరోజైన గురువారం స్థానాలకు 99మంది, 1,740 వార్డు స్థానాలకు 49 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఇక పలు గ్రామపంచాయతీల్లో ఏకగ్రీవానికి చర్చలు జరుగుతున్నాయి. కామేపల్లి మండలం జోగ్గూడెంలో వేలం పాట ద్వారా ఓ అభ్యర్థి రూ.20లక్షలకు సర్పంచ్ పదవి దక్కించుకోగా.. ఆ సొమ్మును ఆంజనేయస్వామి గుడి నిర్మానానికి వినియోగించాలని గ్రామస్థులు నిర్ణయించారు. అలాగే మధిర మండలం దేశినేనిపాలెం గ్రామంలో ఎస్సీ మహిళకు సర్పంచి పదవి రిజర్వ్ అవగా.. శుక్రవారం కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఏకగ్రీవం చేసేందుకు చర్చలు జరిపారు. కాంగ్రెస్‌కు సర్పంచ్ పదవితో పాటు ఐదు వార్డులు, బీఆర్ఎస్‌కు ఉపసర్పంచితో పాటు మరో ఐదు వార్డులు కేటాయించేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. మధిర మండలం మార్టూరిపేటలో జనసేన అభ్యర్థి తోట దీపకళ సర్పంచ్ పదవికి నామినేషన్‌ను శుక్రవారం దాఖలు చేశారు. వీరికి బీఆర్ఎస్, బీజేపీ మద్దను ప్రకటించాయి.

రెండో విడతకు ఏర్పాట్లు..

తొలివిడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో శనివారంతో నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగియనుండగా.. రెండో విడత గ్రామపంచాయతీల్లో ఆదివారం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఈ క్రమంలో కామేపల్లి మండలంలో 24, ఖమ్మం రూరల్‌లో 21, కూసుమంచిలో 41, ముదిగొండలో 25, నేలకొండపల్లిలో 32, తిరుమలాయపాలెం మండలంలో 40పంచాయతీల్లో రెండోవిడతలో ఎన్నికలు జరగనున్నాయి.

రెండో రోజు దాఖలైన నామినేషన్లు ఇలా..

మండలం	సర్పంచ్ స్థానాలు	దాఖలు	వార్డు స్థానాలు	దాఖలు
బోనకల్	22	22	210	58
కొణిజర్ల	27	13	254	10
రఘునాథపాలెం	37	28	308	57
వైరా	22	18	200	28
మధిర	27	27	236	48
ఎర్రుపాలెం	31	33	284	39
చింతకాని	26	16	248	85
మొత్తం	192	157	1740	325

సర్పంచ్ అభ్యర్థులకు గులాబీ.. 7

వార్డు సభ్యులకు తెలుపు రంగు

- బ్యాలెట్ పత్రాల ముద్రణ పూర్తి



అధికారులతో సమీక్షిస్తున్న సాధారణ ఎన్నికల పరిశీలకుడు ఖర్తడే కాళీచరణ్, పక్కన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ప్రశాంత ఎన్నికలకు పటిష్ఠ చర్యలు చేపట్టండి

- నిబంధనలు ఉల్లంఘించిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి
- ఎన్నికల ఫిర్యాదుల నమోదుకు ప్రత్యేక వ్యవస్థ
- జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకుడు ఖర్తడే కాళీచరణ్
- పంచాయతీ పోరు నిర్వహణపై సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రశాంత వాతావరణంలో.. స్వేచ్ఛాయుతంగా పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుధామ రావు సూచించారు. శుక్రవారం ఆయన ఖమ్మం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం సీపీ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పంచాయతీ ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకుడు ఖర్తడే కాళీచరణ్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని, ఎక్కడ చిన్న పొరపాటు జరగడానికి ఆస్కారం ఇవ్వొద్దన్నారు. స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణ జరగాలని స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరగకుండా చూడాలని, అభ్యర్థులు వినూత్న రీతిలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నిస్తారని, దీనిని నిరోధించేందుకు పక్కా నిఘా పెట్టాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఎక్కడా కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొనవద్దన్నారు. అభ్యర్థుల ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, తద్వారా ఎన్నికల పట్ల నమ్మకం పెరుగుతుందని, చిన్న ఫిర్యాదును కూడా నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. ఎఫ్‌సీటీ, ఎస్ఎస్‌టీ ఏర్పాటు, ఫిర్యాదుల నమోదు టోల్ ఫ్రీ నెంబర్ 1077 పట్ల విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. అనంతరం ఎన్నికల సిబ్బంది శిక్షణ, బ్యాలెట్ పేపర్, ప్రింటింగ్ మెటీరియల్ అంశాలకు సంబంధించిన నోడల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి వచ్చే వివిధ ఫిర్యాదులను పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు డీఆర్వో ఆధ్వర్యంలో వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1077 పట్ల విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. నామినేషన్లు ముగిసి అభ్యర్థులు ఖరారైన తర్వాత ప్రలోభాలు పెరిగే అవకాశం ఉందని, క్షేత్రస్థాయిలో బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రచారాన్ని తహసీల్దార్, ఆర్డీవో నిత్యం పర్యవేక్షించాలని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారిని పోటీ నుంచి తొలగించే అవకాశం ఉంటుందన్నారు. సిబ్బంది కేటాయింపు, పోలింగ్ కేంద్రాల వారీగా 3వ ర్యాండమైజేషన్ సాధారణ పరిశీలకుల ఆధ్వర్యంలో చేపట్టాలన్నారు. ప్రతీ అభ్యర్థి నుంచి ఎన్నికలు ముగిసిన 45 రోజుల లోపు వ్యయం వివరాలు సేకరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

పోలీస్ కమీషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్వో పద్మశ్రీ, జడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీఆర్డీవో సన్యాసయ్య, డీపీవో ఆశాలత, డీపీఆర్వో ఎంఏ గౌస్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి టి.సునీల్ రెడ్డి, డీఈవో చైతన్య జైని, సీపీవో శ్రీనివాస్, ఆర్డీవో వెంకట రమణ, డీసీవో గంగాధర్, ఆర్డీవో నరసింహారావు, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ ఎం.అపూర్వ, డిప్యూటీ సీఈవో నాగపద్మజ, డీపీవో రాంబాబు, ఈడీఎం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు అవసరం.. పంచాయతీలకు ఆదాయం!



గ్రామ పంచాయతీ కార్యాలయం

- ఎన్నికల వేళ కచ్చితంగా పన్నులు చెల్లించాల్సిందే
- నామినేషన్ వేయాలన్నా, బలపరచాలన్నా నోడ్యూస్ తప్పనిసరి
- ఉమ్మడి జిల్లాలో 50వేల మంది ముందస్తు పన్ను చెల్లిస్తారని అంచనా
- బకాయిలకూ కలగనున్న మోక్షం

అశ్వారావుపేట రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పంచాయతీ సంగ్రామం వేళ గ్రామపంచాయతీలకు కొంత మేర కాసులు కురవనున్నాయి. దాదాపు రెండేళ్లుగా పంచాయతీలకు ఎన్నికలు లేకపోవటం, ప్రభుత్వాల నుంచి నిధులు పూర్తిస్థాయిలో రాకపోవటంతో పల్లెల్లో పనులు చేద్దామన్నా పైసలు లేని దుస్థితి. పాలకులు లేకపోవటంతో పన్నుల వసూలు కూడా అంతంతమాత్రంగానే జరుగుతోంది. మైదాన ప్రాంతాల్లో పర్వాలేకున్నా గిరిజన ప్రాంతాల్లో పన్నుల వసూళ్ల అంతంత మాత్రంగానే ఉంటాయి. వచ్చే ఆ



పన్నులతోనే కొన్ని పంచాయతీల్లో చిన్నచిన్న పనులు చేయిస్తున్న దుస్థితి. అయితే ప్రస్తుత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీలకు కొంతమేర ఆదాయం సమకూరనుంది. పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తప్పనిసరిగా ఇంటి పన్నును పూర్తిగా చెల్లించి నోడ్యూస్ సర్టిఫికెట్ సమర్పించాలి. సాధారణంగా ఇంటిపన్నులు ఆర్థిక సంవత్సరంలో ఆఖరులో ఆరంభమై రెండుమూడు నెలల పాటు కొనసాగుతుంది. అప్పుడు కూడా అందరూ పన్నులు చెల్లిస్తారనేది సందేహమే. అయితే ఎన్నికల బరిలో ఉండే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నాలుగు నెలలు ముందుగానే పన్ను చెల్లించి రశీదు పొందాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో 1,042 పంచాయతీలు.. 9,382వార్డులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరగనుండగా మొదటి విడతకు నామినేషన్ల స్వీకరణ ఆరంభమైంది. ఖమ్మం జిల్లాలో 20 మండలాల్లో 571 గ్రామ పంచాయతీలు, 5214 వార్డులు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 22 మండలాల్లో (మిగతా 6వ పేజీలో)

సింగరేణిలో 'స్కిల్డ్ ఔట్ సోర్సింగ్'కు మంగళం!

- ఇప్పటికే పనిచేస్తున్న ఉద్యోగుల తొలగింపునకు ప్రయత్నాలు
- కార్మికుల వారసులకు 'కారుణ్యం' ద్వారా సర్దుబాటుకు యాజమాన్యం కసరత్తు

కొత్తగూడెం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఔట్‌సోర్సింగ్ స్కిల్డ్ ఉద్యోగ నియామకాలకు యాజమాన్యం మంగళం పాడేందుకు సిద్ధమవుతోంది. సింగరేణి ప్రధాన కార్యాలయంతో పాటు వివిధ ఏరియాల్లో పలు విభాగాల్లో పనిచేస్తున్న స్కిల్డ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఇదే క్రమంలో కార్మికుల వారసులకు కారుణ్య నియామకాల ద్వారా ఆ పోస్టులను భర్తీ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే సింగరేణిలో అధికశాతం మంది కార్మికులు ఉండడంతో కొత్త నియామకాలు యాజమాన్యానికి తలనొప్పిగా మారాయి. సింగరేణి కార్మికులు సైతం కారుణ్య నియామకాలలో అమ్మాయిలకే ప్రాధాన్యమిస్తున్నారు. అబ్బాయిలు విధులకు డుమ్మా కొట్టడం, ఇతరత్రా సమస్యలతో అధికశాతం కార్మికులు అమ్మాయిలకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుండడంతో వారికి విధులు కల్పించేందుకు యాజమాన్యానికి ఇబ్బందులు తలెత్తుతున్న పరిస్థితులు ఎదురవుతన్నాయి. గత జూన్ నెల నుంచి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించాల్సినప్పటికీ యాజమాన్యం జాప్యం చేస్తూ వస్తోంది. ఇటీవల గుర్తింపు కార్మిక సంఘం, ప్రాథమిక కార్మికసంఘంతో చైర్మన్ స్థాయిలో జరిగిన చర్చల్లో కారుణ్య నియామకానికి చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీ మేరకు గత జూన్‌నుంచి సెప్టెంబరు వరకు పెండింగ్‌లో ఉన్న 374 కారుణ్య నియామకాలకు ఈ నెల 16వ తేదీన కొత్తగూడెంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమంలో సంస్థ సీఎండీ బలరాం, డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. గత మార్చి నెల నుంచి నిలిచిపోయిన మెడికల్‌బోర్డు సైతం ఈ నెల ప్రారంభం కావడంతో.. తిరిగి కారుణ్య నియామకాల కింద ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సి ఉన్న నేపథ్యంలో సింగరేణి ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న స్కిల్డ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను తొలగించి ఆ స్థానంలో కారుణ్యం కింద ఉద్యోగ అవకాశం కల్పించే దిశగా యాజమాన్యం ప్రయత్నం చేస్తోంది. సింగరేణి పరిధిలోని వివిధ ఏరియాలో సైతం ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారి వివరాలను సేకరించి వారి స్థానంలో కార్మికుల వారసులకు కారుణ్య నియామకాల ద్వారా సర్దుబాటు చేయాలని యాజమాన్యం (మిగతా 6వ పేజీలో)

'తానా' బాలసాహిత్యభేరికి ఆహ్వానం


విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్ఎం హరిత

అశ్వారావుపేట రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ప్రపంచ సాహిత్యవేదిక ప్రతిష్ఠాత్మకంగా బాలసాహిత్యభేరి పేరుతో నిర్వహిస్తున్న అంతర్జాతీయ బాల సాహిత్య సమ్మేళానికి అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కంభంపాటి శృతి ఎంపికైంది. ఈమేరకు తానా నుంచి పాఠశాల హెచ్ఎంకు సమాచారం అందింది. ఈనెల 30న అంతర్జాలంలో జరిగే సమ్మేళనంలో కథ, వచన, కవిత్వం, గేయ, పద్యం విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. గేయ విభాగంలో పేట విద్యార్థిని శృతి 3 నిమిషాల పాటు తన వాణిని వినిపించనుంది. ప్రముఖ కవి, రచయిత సీఆర్‌పీ ప్రభాకరాచార్యులు నేతృత్వంలో భాషా ఉపాధ్యాయులు రమాదేవి పర్యవేక్షణలో చిన్నారి తన గేయాన్ని వినిపించనుంది. ఈమేరకు పాఠశాలలో శుక్రవారం విద్యార్థి శృతిని హెచ్ఎం హరితతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.


పోతురాజు

సత్తుపల్లి: ఉత్తర అమెరికా తెలుగు సంఘం 'తానా' ఆధ్వర్యంలో ఈనెల 30న జరుగు అంతర్జాతీయ బాల సాహిత్య భేరిలో పాల్గొనేందుకు బాల సాహిత్య రచయిత ఆవుల పోతురాజుకు ఆహ్వానం అందింది. సత్తుపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పోతురాజు ఆరోజున జరిగే బాల సాహిత్య భేరిలో ప్రథమంగా కథల విభాగాన్ని నిర్వహిస్తున్నారు. ఆవుల పోతురాజు తాను రచించిన 'నాన్నే నా హీరో' పుస్తకం నుంచి ఒక కథను చదివి వినిపిస్తారు. ఈ మేరకు తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి, నిర్వహకులు డాక్టర్ ప్రసాద్ తోటకూర, సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్ నుంచి పోతురాజుకు ఆహ్వానం అందింది. అరుదైన ఈ అవకాశాన్ని దక్కించుకున్న పోతురాజును ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్కే.సోందు, తెలుగు ఉపాధ్యాయిని ఎం.రమాదేవి, గార్లపాటి-బొల్లేపల్లి ట్రస్ట్ నిర్వహకులు జీ.రామకృష్ణ, బీ.మధుసూదనరాజు, ఉపాధ్యాయులు అభినందనలలు తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా రాంప్రసాద్


ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డిని కలిసిన నూతన కార్యవర్గం

ఇల్లెందు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యవర్గం ఎన్నికలు శుక్రవారం జరిగాయి. ఈ ఎన్నికల్లో ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా బీ.రాంప్రసాద్(ఇన్‌స్పెక్టర్ ఇల్లెందు), ప్రధాన కార్యదర్శిగా ఎం.శేఖర్(ఇన్‌స్పెక్టర్ సత్తుపల్లి), కోశాధికారిగా ఎం.ప్రసాద్(ఇన్‌స్పెక్టర్ పాల్వంచ), ఉపాధ్యక్షురాలిగా ఎం.ప్రశాంతి(ఇన్‌స్పెక్టర్ సింగరేణి), అసోసియేట్ అధ్యక్షుడిగా జె.రమేశ్(కొత్తగూడెం), జాయింట్ సెక్రటరీగా ఎస్.రమేశ్(నేలకొండపల్లి), ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.వసంతలక్ష్మి(సింగరేణి), కార్యవర్గ సభ్యులుగా ఎస్కే.రహీమున్నీసా(భద్రాచలం), ఎస్.జయశ్రీ(ఖమ్మం), సీహెచ్ శ్రీహరిరావు(కొత్తగూడెం), ఎం.సాయిరాం(వైరా) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేశ్, ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగం ఉన్నతాధికారులు నాగేంద్రరెడ్డి, జానయ్య తదితరులను నూతన అధ్యక్షుడు రాంప్రసాద్ ఆధ్వర్యంలో స్వయంగా కలిసి సత్కరించారు.

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'దీక్షా దివస్'

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ నిరాహార దీక్ష మొదలుపెట్టిన రోజును పురస్కరించుకొని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శనివారం నగరంలో 'దీక్షా దివస్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్థానిక పెవీలియన్ గ్రౌండ్ వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఉద్యమ అమరులకు శ్రద్ధాంజలి, ఎన్టీఆర్ సర్కిల్‌లో తెలంగాణ తల్లికి పుష్పాంజలి, అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ధరణి అప్లికేషన్‌కు భూభారతిలో మోక్షం

» కలెక్టర్ అనుదీప్ ఆదేశాలతో పాస్ పుస్తకం జారీ

ఖమ్మంరూరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఓ ఎన్నారై 2022లో ధరణిలో చేసుకున్న అప్లికేషన్ కు భూభారతిలో మోక్షం లభించింది. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలతో ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్ మూడు రోజుల్లో ఎన్నారైకు పాస్ పుస్తకాలు అందజేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డుకు చెందిన పలుపులేటి రాజగోపాల్ అమెరికాలో స్థిరపడ్డాడు. ఇతనికి ఏదులాపురం రెవెన్యూ సర్వే నెంబర్లలో కొంత భూమి ఉంది. దీనికోసం తన ఎన్నారై పోర్టల్ నుంచి 2022 లో దరఖాస్తు చేసుకున్నాడు. కానీ దీనిపై అప్పటి అధికారులు స్పందన లేకపోవడంతో అది అలాగే తహసీల్దార్ లాగిన్‌లో ఉండిపోయింది. ఈ నేపథ్యంలో సదరు ఎన్నారై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వాట్సప్ ద్వారా తన పరిస్థితిని విన్నవించారు. తక్షణమే స్పందించిన తహసీల్దార్ దరఖాస్తులో ఉన్న సమస్యలను సదరు ఎన్నారైతో చర్చించారు. అలాగే ఇక్కడి వారి కుటుంబ సభ్యుడైన వెంపటి సురేందర్ ద్వారా ప్రతాలను తెప్పించుకుని, పరిశీలన చేసి పాస్ పుస్తకాన్ని శుక్రవారం అందజేశారు. పాస్ పుస్తకాన్ని అందజేసిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి, తహసీల్దార్ రాంప్రసాద్‌లకు ఎన్ఆర్ఐ రాజగోపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

సివిల్ దావా కొట్టివేత

ఖమ్మం లీగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల ఫోరం పక్కనగల స్థలంపై దాఖలైన సివిల్ దావాను ఖమ్మం మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి వి.శివరంజని శుక్రవారం సివిల్ దావాను కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. కేసు వివరాల ప్రకారం.. 2010లో బిజ్జాల జనార్ధన్, వారి కుటుంబ సభ్యులు అప్పటి ఖానాపురంహవేలి గ్రామ పంచాయతీలోని వైరారోడ్డు ఖమ్మం వినియోగదారుల ఫోరం పక్కన గల ఖాళీస్థలం తమదిగా నిర్ధారించమని కోర్టులో సివిల్‌దావా వేశారు. తరువాత ఖానాపురంహవేలి గ్రామపంచాయతీని ఖమ్మం మునిసిపల్ కార్పోరేషన్‌లో విలీనం అయింది. ఖమ్మం మునిసిపల్ కార్పోరేషన్ తరుపున ప్రభుత్వ న్యాయవాదులుగా రవీంద్ర, ఏజీపీ కండెపనేని రత్నాకర్ రావులు వాదనలు వినిపించారు. ఆ స్థలం ఖమ్మం మునిసిపల్ కార్పోరేషన్‌కు చెందినదిగా నిర్ధారించాలని ఆధారాలు చూపించారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయధికారి సివిల్ దావాను కోట్టి వేస్తూ తీర్పుచెప్పారు.

రేపు రుద్రంపూర్‌లో భద్రాద్రి జిల్లా స్థాయి ఈత పోటీలు

చుంచుపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రుద్రంపూర్‌లో ఆదివారం జిల్లాస్థాయి ఈత పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ హనుమంతరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 2008 నుంచి 2014 మధ్యలో జన్మించిన వారై ఉండాలన్నారు. అదేవిధంగా ప్రతిభ కనబర్చిన వారిని డిసెంబరు నెల 8వ, 9వ తేదీలలో ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 9866923395, 9908053539 నెంబర్లను సంప్రదించాలన్నారు.

క్రీడలకు సింగరేణి ప్రోత్సాహం

» కబడ్డీ పోటీల ప్రారంభంలో డైరెక్టర్ ఆపరేషన్ సూర్యనారాయణ

» ఘనంగా కోల్ ఇండియా స్థాయి కబడ్డీ పోటీలు షురూ

కొత్తగూడెం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : క్రీడలను ప్రోత్సహించడంలో సింగరేణి యాజమాన్యం అగ్రభాగంలో నిలుస్తుందని ఆ సంస్థ డైరెక్టర్ ఆపరేషన్ ఎల్‌వీ. సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్ లో కోల్ ఇండియా స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు నిరంతరం శ్రమించాలన్నారు. కోల్ ఇండియా స్థాయిలో జరిగే పోటీలను కొత్తగూడెం ఏరియాకు అవకాశం రావడం హర్షనీయం అన్నారు. ప్రాథమిక దశ నుంచే యువత క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడాకారులకు అవసరమైన వసతి సదుపాయాలను కల్పించడంలో సింగరేణి యాజమాన్యం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. సింగరేణి క్రీడాకారులు కోల్ ఇండియా పోటీల్లో సత్తా చాటి సింగరేణి ప్రతిష్టను పెంచాలని కోరారు. గెలుపుఓటములతో సంబంధం లేకుండా స్నేహ పూర్వక వాతావరణంలో క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ కొప్పుల వెంకటేశ్వర్లు, సింగరేణి డైరెక్టర్ ఈ అండ్ఎం మోకాళ్ల తిరుమలరావులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మంచి ఆదరణ ఉన్న కబడ్డీ పోటీలను కోల్ ఇండియా స్థాయిలో నిర్వహించడం ఎంతో ఆదర్శనీయమన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి క్రీడలు దోహదం చేస్తాయని అన్నారు. కోల్ ఇండియా పరిధిలోని బొగ్గు కంపెనీల క్రీడాకారులు హాజరుకావడం హర్షణీయమన్నారు. క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకునటకు క్రీడాకారులు నిరంతరం శ్రమించాలన్నారు. వివిధ కంపెనీల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుర్తింపు కార్మిక సంఘం నాయకులు రాజ్ కుమార్, ప్రాతినిధ్య కార్మిక సంఘం నాయకులు త్యాగరాజన్, సీఎంఓఏ అధ్యక్షుడు ఎంవీ నరసింహారావు, జీఎం పర్సనల్ జీవీ. కిరణ్ కుమార్, ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏరియా ఇంజనీర్ సూర్యనారాయణరాజు, ఏజీఎం సివిల్ రామకృష్ణ, వరప్రసాద్, శివకేశవరావు, ముకుంద సత్యనారాయణ, రజాక్, మల్లిఖార్జున్, స్పోర్ట్స్ ఆఫీసర్లు సునీల్, సూపర్‌వైజర్ ఎంసీ పాస్‌నెట్ తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పోటీల్లో సత్తా చాటిన సింగరేణి

కొత్తగూడెం ఏరియా ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో జరిగిన కోల్ ఇండియా స్థాయి కబడ్డీ పోటీల్లో సింగరేణి క్రీడాకారులు సత్తా చాటారు. మొత్తం ఐదు మ్యాచ్‌లు జరగగా రెండు మ్యాచ్‌లలో విజయం సాధించారు. మొదటి మ్యాచ్‌లో సింగరేణి కాలరీస్ లిమిటెడ్, భారత్ కోకింగ్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ తలపడగా సింగరేణి 85 పాయింట్స్ సాధించగా బీసీసీఎల్ 15 పాయింట్లతో సాధించింది. దీంతో సింగరేణి క్రీడాకారులు విజయం సాధించారు. రెండవ మ్యాచ్‌లో సౌత్ వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ క్రీడాకరులకు ఈసీఎల్ క్రీడాకారులకు జరిగిన పోటీలో ఎస్ఈసీఎల్ 36 పాయింట్లు సాధించగా ఈసీఎల్ 25 పాయింట్లు సాధించడంతో ఎస్ఈసీఎల్ 36 పాయింట్లతో విజయం సాధించింది. మూడవ మ్యాచ్‌లో వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్‌కి సీసీఎల్‌కు పోటీ జరగగా డబ్ల్యూసిఎల్ వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ 44 పాయింట్లు సాధించగా సీసీఎల్ 12 పాయింట్లు సాధించింది. దీంతో డబ్ల్యూసీఎల్ 44 పాయింట్లతో గెలుపొందింది. నాలుగవ మ్యాచ్‌లో నార్థర్న్ కోల్‌ఫీల్డ్స్ ఎన్‌సీఎల్ కు వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ ఈసిఎల్‌కు మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎన్‌సీఎల్ 39 పాయింట్లు సాధించగా ఈసిఎల్ 33 పాయింట్లు సాధించగా ఎన్‌సీఎల్ 39 పాయింట్లతో గెలుపొందింది. ఐదవ మ్యాచ్ సింగరేణి కాలరీస్ కంపెనీ సీసీఎల్, రాంచీకి మధ్య జరిగిన పోటీలో ఎస్ఈసిఎల్ 58 పాయింట్లు సాధించగా సీసీఎల్ 5 పాయింట్లతో సరిపెట్టుకోగా సింగరేణి కాలరీస్ కంపెనీ విజయం సాధించినట్లు నిర్వాహకులు ప్రకటించారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సింగరేణి డైరెక్టర్లు

2న 'గూడేని'కి సీఎం

(5వ పేజీ తరువాయి)

శిలాఫలకం ఏర్పాటు, ఆవరణ అభివృద్ధి, అంతర్గత రోడ్ల మరమ్మతులు, సందర్శకుల కోసం ఏర్పాటు చేయాల్సిన మార్గదర్శక బోర్డులు, పార్కింగ్ స్థలాలు, స్టేజీ నిర్మాణం, విద్యుత్ సౌకర్యాల కల్పనకు సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ ఏర్పాట్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం పరిశీలించనున్నారు.

ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలి : కలెక్టర్ జితేష్

కొత్తగూడెం ఎడ్యుకేషన్ : డిసెంబరు 2న ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలను సంబంధిత శాఖల ఇంజనీరింగ్, రోడ్లు, భవనాలు, విద్యుత్, పోలీస్ శాఖ, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, పనుల పురోగతి, భద్రతా చర్యలు, నిర్వహణ తదితర అంశాల గురించి అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. లోటుపాట్లు ఏవైనా ఉన్న వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. విశ్వవిద్యాలయం సుందరీకరణలో భాగంగా మొక్కలు నాటడం, ప్రాంగణ పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు, శానిటేషన్ ఏర్పాట్లు పూర్తి చేసి, ముఖ్యమంత్రి పర్యటన నాటికి ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. పర్యటన రూట్ మ్యాప్ తుది రూపు, ట్రాఫిక్ సర్దుబాట్లు, అగ్ని మాపక చర్యలు, వైద్య బృందాల నియామకం, వీవీపీ ప్రొటోకాల్ అమలు లాంటి అంశాలపై కూడా కలెక్టర్ ప్రత్యేక సూచనలు చేశారు. కలెక్టర్ వెంట యూనివర్శిటీ ప్రిన్సిపల్ డాక్టర్ జగన్మోహన్ రాజు, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, అధికారులు పాల్గొన్నారు.

సింగరేణిలో 'స్కిల్డ్ ఔట్ సోర్సింగ్'కు మంగళం!

(5వ పేజీ తరువాయి)

భావిస్తోంది. ఈ నేపథ్యంలో సింగరేణిలో స్కిల్డ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు మంగళం పాడే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కాంట్రాక్ట్ పద్దతిలో ఉద్యోగ నియామకాలు సాధించుకున్న కాంట్రాక్టర్లు ఇప్పటికే నిరుద్యోగం నుంచి పెద్ద ఎత్తున ఆర్థిక లావాదేవీలకు పాల్పడ్డట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల పైరవీలకు సైతం చెక్ పెట్టేందుకు యాజమాన్యం కార్మిక వారసులకే ఉద్యోగాలు ఇవ్వాలనే ప్రయత్నం చేస్తోంది. సింగరేణి ప్రధాన కార్యాలయంతో పాటు వివిధ ఏరియాల్లో పనిచేస్తున్న స్కిల్డ్ ఔట్ సోర్సింగ్ వారికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రూ.లక్షలు చెల్లించి ఔట్‌సోర్సింగ్‌లో చేరిన వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారినట్టు పలు కార్మిక సంఘాల నాయకులు వ్యాఖ్యానించడం గమనార్హం. ఏదేమైనా సింగరేణి యాజమాన్యం చేపడుతున్న పలు సంస్కరణలు పర్మినెంట్ కార్మికులకు ఉపయోగపడేలా ఉన్నట్టు కార్మిక సంఘాల నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. యాజమాన్యం నిర్ణయానికి పలు కార్మిక సంఘాలు మద్దతు ఇస్తున్నాయి.

ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

» ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, పెన్షనర్స్ బకాయిలు, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని కోరుతూ పీఆర్టీయూ ఖమ్మం జిల్లా శాఖ చేపట్టిన 30 గంటల నిరాహర దీక్షను శుక్రవారం ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి నిమ్మరసం ఇచ్చి విరమింపచేశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభు త్వం ఏర్పడి 2 సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చక పోవడం శోచనీయమని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనేకమార్లు ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేశామని, నెలకు రూ.700 కోట్లు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ దిశగా నిధులు విడుదల చేయక పోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. దాని పర్యవసానమే ఖమ్మం జిల్లాశాఖ చేపట్టిన 30 గంటల నిరాహార దీక్షని అన్నారు. కార్యక్రమం లో రాష్ట్ర ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, పీఆర్‌పీఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మోతుకూరి మధు, వెంకట నర్సయ్య, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు, అసోసియేట్ అధ్యక్షుడు విజయ్ అమృత కుమార్, బ్రహ్మా రెడ్డి, రాష్ట్ర బాద్యులు వెంకటేశ్వరరావు, రెబ్బా శ్రీనివాసరావు, మదార్ హసేన్, జిల్లా బాద్యులు పాల్గొన్నారు.


దీక్షలో ఉన్న వారికి నిమ్మరసం ఇస్తున్న శ్రీపాల్‌రెడ్డి

రైతులకు మార్గదర్శకంగా ఉండాలి

» భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

బూర్గంపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామపంచాయతీలో వ్యవసాయ ఆధారిత బహుముఖ ఆదాయ వనరులను గ్రామస్థులకు చేరువ చేయడం లక్ష్యంగా రూపొందించిన మోడల్ ఫామ్ డెమో హౌస్ రైతులకు మార్గదర్శకంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం మోడల్ ఫామ్ డెమో హౌస్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి ఉపాధి అవకాశాల విస్తరణ, సేంద్రియ వ్యవసాయ ప్రోత్సాహంపై దృష్టి సారించి రూపొందించిన ఈ మోడల్ ఫార్మ్ జిల్లా స్థాయిలో ఒక ఆదర్శ ప్రదర్శనగా నిలుస్తుందన్నారు. మోరంపల్లిబంజర గ్రామంలో 15గుంటల నిరుపయోగ భూమిని ఉపయోగించి కూరగాయల సాగు, బంతిపూల సాగు, చేపలు, కౌజుపిట్టల పెంపకం వంటి పలు విభాగాలను సమగ్ర ప్రదర్శన రూపంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. గ్రామీణ స్థాయిలో రైతులు మహిళా సంఘాలు, యువతకు ప్రత్యక్ష అవగాహన కలిగించడానికి ఈ మోడల్ ఫామ్ ఉపయుక్తంగా ఉండాలని తెలిపారు. కౌజు పిట్టలు, చేపల పెంపకం కోసం కలెక్టర్ అందించిన నమునా ఆధారంగా ప్రత్యేక షేడ్‌ను నిర్మించడం పూర్తయిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఇలాంటి మోడల్ ఫార్మ్‌లు పెరిగితే రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందే అవకాశాలు అధికమవుతాయని సేంద్రీయ వ్యవసాయానికి ప్రోత్సాహం లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. సీసీ లీలావతి, వీవోఏ భారతి సమన్వయంతో ఏపీఎం హేమంత్ పర్యవేక్షణలో రోజువారీ పనులు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, ఎంపీడీవో జమలారెడ్డి, ఈజీఎస్ ఏపీవో విజయలక్ష్మి, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


బంతిపూల తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్

డిప్యూటీ సీఎం భట్టి స్వగ్రామంలో ఏకగ్రీవానికి ప్రయత్నాలు!

వైరా, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురం గ్రామపంచాయతీ ఎన్నికను ఏకగ్రీవం చేసుకొనేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో అదే గ్రామానికి చెందిన నూతన డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మాజీ డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ శుక్రవారం స్నానాల లక్ష్మీపురం వెళ్లి అందుబాటులో ఉన్న స్థానిక నాయకులతో ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం, నామినేషన్ల చివరి రోజైన శనివారం గ్రామంలోని కాంగ్రెస్ సహా ఇతర పార్టీలకు చెందిన వారితో సమావేశాన్ని నిర్వహించి ఆశావాహుల పేర్లను సేకరించి భట్టి విక్రమార్కకు నివేదించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ పంచాయతీలో ఓసీకి కేటాయించారు. 561మంది ఓటర్లు ఉన్నారు. 2019 గ్రామపంచాయతీ ఎన్నికలు ఇక్కడ హోరాహోరీగా జరిగాయి. అప్పుడు కాంగ్రెస్‌లోనే వర్గాలు విడిపోయి పోటీపడ్డారు. నూతి వెంకటేశ్వరరావు(బాబు), అమ్మిక రామారావు పోటీపడ్డారు. వెంకటేశ్వరరావు విజయం కోసం భట్టి విక్రమార్క కుటుంబసభ్యులు, ఇతర నాయకులు కృషి చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. చివరకు రామారావు 111ఓట్ల మెజార్టీతో వెంకటేశ్వరరావుపై విజయం సాధించారు. ఈ తరుణంలో వచ్చే నెల 11న ఎన్నికలు జరగనున్నాయి. నేటితో నామినేషన్ల దాఖల గడువు ముగియనుంది. ఇప్పటికే కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఉపసర్పంచ్ మల్లు రామకృష్ణ శుక్రవారం సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఓసీకి చెందిన వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, బీసీకి చెందిన మల్లు రామకృష్ణ, నూతి వెంకటేశ్వరరావు, బాలబోయిన వెంకన్న తదితరులు కూడా సర్పంచ్ పదవిని ఆశిస్తున్నారు. ఈ తరుణంలో ఏకగ్రీవ ప్రయత్నాలు ఊపందుకున్నాయి. చివరికి భట్టి విక్రమార్క సూచించిన అభ్యర్థి ఖరారు కానున్నట్లు సమాచారం.

అభ్యర్థులకు అవసరం.. పంచాయతీలకు ఆదాయం!

(5వ పేజీ తరువాయి)

471 పంచాయతీల్లో 4,168 వార్డులు ఉన్నాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 1,042 పంచాయతీలకు, 9,382 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఆయా పంచాయతీల్లో పోటీచేసే అభ్యర్థుల సంఖ్య రెండు మూడింతలు ఉంటుంది. అంటే సర్పంచ్‌కు దాదాపు 3వేలపైగా నామినేషన్లు, వార్డులకు దాదాపు 30వేల నామినేషన్లు వేసే అవకాశం ఉంది. అంటే బరిలో నిలిచే అభ్యర్థులంతా నామినేషన్‌తో పాటు తప్పనిసరిగా తమ ఇంటి పన్నును చెల్లించి రశీదును పొంది నామినేషన్ పత్రాలకు జతచేయాలి. వీరితో పాటు అభ్యర్థులను బలపరిచే వారు కూడా తప్పనిసరిగా ఇంటిపన్నును చెల్లించాల్సిందే. ఆ లెక్కన రెండు జిల్లాల్లో దాదాపు 50వేల మంది వరకు ముందస్తుగా ఇంటి పన్ను చెల్లించే అవకాశం ఉంటుందని అంచనా.

సమకూరనున్న ఆదాయం

పంచాయతీల్లో ఇంటిపన్ను చెల్లింపులు కూడా అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. కొందరు రెగ్యులర్‌గా పన్నులు చెల్లిస్తుంటే.. మరికొందరు అవసరం అయినపుడు మాత్రమే ఇంటిపన్ను కడుతున్నారు. ప్రస్తుతం గిరిజన ప్రాంతాల్లో ఒక్కో ఇంటికి రూ.500 నుంచి ఆపైన పన్ను ఉంటుంది. మైదాన ప్రాంతాల్లో దానికి కొద్దిగా అదనంగా ఉంటుంది. ప్రస్తుతం పంచాయతీల్లో పదుల సంఖ్యలోనే నామినేషన్లు దాఖలవుతాయి. పోటీచేసే ఆశావాహులు కూడా అధికంగా ఉండటంతో నామినేషన్లు కూడా అధికంగానే వేస్తారు. నామినేషన్ వేసే ప్రతి ఒక్కరూ ముందుగానే పంచాయతీకి పన్నులు చెల్లించటం ద్వారా కొంతమేర ఆదాయం సమకూరుతుంది. ఒకవేళ ఇంటి పన్ను బకాయి ఉన్నా పూర్తిగా చెల్లిస్తేనే నోడ్యూ సర్టిఫికెట్ ఇస్తారు. అంటే కొన్నిచోట్ల బకాయిలు ఉంటే అవికూడా వసూలు అయ్యే అవకాశం ఉంది. ఒక్కో పంచాయతీకి కనీసం రూ.20వేలు ఆపైన ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

నాణ్యమైన విత్తనాలను అందించాలన్నదే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలన్నదే లక్ష్యమని నూతన ముసాయిదా విత్తన చట్టాన్ని అమలుచేస్తున్నట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నూతన ముసాయిదా విత్తన చట్టంపై సెమినార్‌లో పాల్గొని మాట్లాడారు. విత్తనాల కొనుగోలు ఆ తర్వాత పరిణామాల్లో రైతులు ఏమైనా నష్టపోతే ఉల్లంఘనలు జరిగితే రైతులకు న్యాయం జరిగేలా ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి, పుల్లయ్య, ఉద్యానవన శాఖ అధికారి మధుసూధన్, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరిత, వ్యవసాయ సహాయ సంచాలకులు వాసవి రాణి, వెంకటేశ్వరారావు, శ్రీనివాసరెడ్డి, కరుణశ్రీ, సతీష్ పాల్గొన్నారు.

జోగ్గూడెం సర్పంచ్ @ రూ.20లక్షలు

(5వ పేజీ తరువాయి)

పాట మొదలు పెట్టగా పోనుపోను రవసవత్తరంగా మారింది. ఉత్కంఠగా సాగిన ఈ వేలంపాటలో చివరకు కాంగ్రెస్ పార్టీకి చెందిన భూక్యా సైదమ్మ భర్త లక్ష్మణ్ రూ.20లక్షలకు పాడి భార్యకు సర్పంచ్‌ను దక్కించుకున్నారు. ఈ నగదు నామినేషన్ వేసే సమయంలో గ్రామ పెద్దలకు అప్పజెప్పాలని నిర్ణయించారు. కామేపల్లి మండలంలో సర్పంచ్ ఎన్నికలు రెండో విడతలో జరగనున్నాయి. ఆ డిపాజిట్ సొమ్ము, వేలంపాటలో పాడిన సొమ్ము రూ.20లక్షలను గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం నిర్మాణానికి ఉపయోగిస్తామని గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు తెలిపారు. అయితే నామినేషన్ దాఖలు, ఉపసంహరణ గడువు నాటికి ఆ సొమ్ము చెల్లించకపోతే యథావిధిగా ఎన్నికలకు వెళ్తామని వారు స్పష్టం చేశారు.

సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటాలి

» మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం మార్కెట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం రఘునాథపాలెం మండలం ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో కూరాకుల నాగభూషణం, గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, వీరునాయక్, కర్నాటి కృష్ణ, మక్బూల్, ఖమర్, బచ్చు విజయ్‌కుమార్ తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పువ్వాడ అజయ్

రామయ్యను దర్శించుకున్న న్యాయాధికారి శివనాయక్


రామాలయంలో న్యాయాధికారి శివనాయక్ దంపతులు

భద్రాచలం/దుమ్ముగూడెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి వారు శుక్రవారం సందర్భంగా స్వర్ణభద్రకవచాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే స్వామి వారిని భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయస్థానం న్యాయాధికారి శివనాయక్ దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు స్వామి వారి నిత్యకల్యాణంలో పాల్గొన్నారు. అలాగే వారికి వేద ఆశీర్వచనం అందజేయడంతో పాటు దేవస్థానం తరపున జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్ అందజేశారు. అలాగే స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

దుమ్ముగూడెం: భద్రాచలం ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ కోర్ట్ ఇన్‌చార్జ్ మెజిస్ట్రేట్ సూరిరెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం పర్ణశాల రామాలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. నారచీరలు, కుటీరం ప్రాంతాలను సందర్శించారు.



అందరి దృష్టి భద్రాద్రి పీఠంపైనే!



భద్రాచలం మేజరు గ్రామ పంచాయతీ కార్యాలయం

ఇప్పటికే నామినేషన్ దాఖలు చేసిన ఆ ఇద్దరు
ఒకరికి అధికారపార్టీ..
మరొకరికి ప్రతిపక్షం మద్దతు
పట్టుసాధించేందుకు పార్టీల పొత్తులు
నేతల మధ్య కొనసాగుతున్న మంతనాలు
బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తు
కూటమి అభ్యర్థి ఖరారు

భద్రాచలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల వేళ భద్రాచలం మేజరు గ్రామ పంచాయతీ సర్పంచ్ పీఠంపైనే అందరి దృష్టి నిలిచింది. తెలంగాణ ఆవిర్భవించిన అనంతరం తొలిసారి భద్రాచలం సర్పంచ్ స్థానానికి ఎన్నిక జరగనుండటంతో ఒక్కసారిగా భద్రాచలంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. నామినేషన్ల తొలి రోజునే అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు బలపర్చిన అభ్యర్థులు పూనెం కృష్ణ, మానె రామకృష్ణ నామినేషన్లు దాఖలు చేయడం విశేషం. తొలిఘట్టం పూర్తికావడంతో ఆ పార్టీలకు చెందిన నాయకులు పట్టు సాధించేందుకు మలిఘట్టంపై దృష్టిసారించారు. ఈ క్రమంలో ఎలా ముందుకు వెళ్లాలో చర్చలు కొనసాగిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మిత్రపక్షంగా నిలిచిన సీపీఐ ప్రస్తుత స్థానిక పరిస్థితుల రీత్యా తటస్థంగా ఉన్నామని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. డిసెంబరు మూడో తేదీన తాము ఎవరికి మద్దతు ఇస్తామనే దానిపై స్పష్టత ఇస్తామని ఆపార్టీ నాయకులు పేర్కొంటున్నారు. కాగా బీఆర్ఎస్ సీపీఎంతో పాటు మాజీ జడ్పీటీసీ సభ్యులు గుండు శరత్ (గోండ్వాన దండకారణ్య పార్టీ)ల మధ్య పొత్తు కుదిరినట్టు ఆ కూటమి నాయకులు పేర్కొంటున్నారు. మరో వైపు బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తులో కూటమి సర్పంచి అభ్యర్థిగా పట్టణానికి చెందిన ఓ ప్రముఖ కాంట్రాక్టర్ హరిచంద్ర నాయక్‌ను ఎంపిక చేసినట్లు నాయకులు తెలిపారు. కూటమి తరఫున సర్పంచ్ అభ్యర్థితో పాటు అన్ని వార్డు స్థానాలకు అభ్యర్థులు బరిలో నిలుచుంటారని నాయకులు తెలిపారు.

పట్టుసాధించేందుకు పొత్తులు

పట్టుసాధించేందుకు ప్రధాన పార్టీలు పొత్తులకు తెరతీయగా నిన్నటివరకు ఎడముఖం, పెడముఖంగా ఉన్న పార్టీలు సైతం ఒకే గూటికి చేరి మంతనాలు చేస్తుండటం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. బీఆర్ఎస్, సీపీఎం, గోండ్వాన దండకారణ్య పార్టీల మధ్య పొత్తు అధికారికంగా ఖరారైంది. ఈ పొత్తుల్లో భాగంగా సీపీఎంకు ఐదు వార్డులు, ఉపసర్పంచ్ పదవి, గోండ్వాన దండకారణ్య పార్టీకి మూడు వార్డులు కేటాయించినట్లు తెలుస్తోంది. సుమారు దశాబ్దకాలం తరువాత మళ్లీ పంచాయతీకి ఎన్నికలు జరుగుతుండటంతో ప్రధాన పార్టీలు బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు విజయం సాధిస్తామనే ధీమాతో ముందుకు వెళ్తున్నారు. అయితే తెరపైకి బీజేపీ టీడీపీ, జనసేన కూటమి తరఫున సర్పంచ్ అభ్యర్థిగా మరొకరు నేడు నామినేషన్ వేయనున్నట్లు సమాచారం. దీంతో భద్రాచలంలో సర్పంచ్ స్థానంకు త్రిముఖ పోటీ జరిగే అవకాశం ఉంది.

పల్లె సమరం! 2025

మొదటి అక్షరంతోనే.. క్రమసంఖ్య గుర్తు కేటాయింపు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్‌లో దాఖలు చేసిన పేరులో మొదటి అక్షరానికి తెలుగు వర్ణమాల ప్రకారం బ్యాలెట్ పత్రంలో క్రమసంఖ్య, గుర్తును కేటాయించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలున్నాయి.

క్రమసంఖ్య గుర్తు కేటాయింపు ఎలాగంటే..

ఉదాహరణకు అప్పయ్య సిరిపురపు అనే వ్యక్తి నామినేషన్ దాఖలుచేస్తే అతని నామినేషన్‌లో పేర్కొన్న విధంగా పేరులోని మొదటి అక్షరం 'అ'ను పరిగణలోకి తీసుకుంటారు. తెలుగు వర్ణమాలలోని మొదటి అక్షరం అవడం వలన బ్యాలెట్ పేపర్‌లో మొదటి క్రమసంఖ్యను వరుసలో మొదటి గుర్తును అతనికి కేటాయిస్తారు. బ్యాలెట్ పేపర్‌లో పోటీచేసే అభ్యర్థుల పేర్లు ముద్రించారు.

ఆది సుబ్బారావు అనేవ్యక్తి నామినేషన్ వేసిన అభ్యర్థి పేరులో ఉన్న మొదటి అక్షరం 'ఆ' తెలుగు వర్ణమాలలోని తర్వాతి అక్షరం కావున రెండో సంఖ్యను, గుర్తును ఇతనికి కేటాయిస్తారు. అలాగే కేవీ పుల్లయ్య అనేవ్యక్తి నామినేషన్‌లో పేరురాసి దాఖలు చేస్తే ఇంటి పేరు అసంపూర్తిగా ఉన్నందున ఇంటిపేరును వదిలిపెట్టి పుల్లయ్యలోని మొదటి అక్షరం 'ప'ను పరిగణలోకి తీసుకుంటారు.

ఇంటిపేరు, వ్యక్తి పేరు ఒకటైతే..!

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్‌లో ఇంటిపేరు, అభ్యర్థి పేర్లు ఒకటే ఉంటే అప్పుడు ఆ వ్యక్తుల పుట్టిన తేదీలను పరిగణలోకి తీసుకుంటారు. అవికూడా ఒకే విధంగా ఉంటే చివరికి నామినేషన్ దాఖలు సమయంలో ఇచ్చిన క్రమసంఖ్య ఆధారంగా వారికి గుర్తులు, వరుస సంఖ్యను కేటాయిస్తారు.

పంచాయతీ ఎన్నికల్లో గుర్తులివే..


ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల్లో పోటీచేసే అభ్యర్థులకు గుర్తులను ఎన్నికల సంఘం కేటాయించింది. వాటి వివరాల్లోకి వెళితే సర్పంచి అభ్యర్థులకు 20గుర్తులు, వార్డు సభ్యులకు 15గుర్తులను కేటాయించింది.

సర్పంచ్ అభ్యర్థులకు :

బుట్ట, ఉంగరం, కత్తెర, కుట్టుమిషన్, బ్యాట్, పలక,బల్ల, బ్యాటరీ లైటు, బ్రష్, క్యారెట్, టేబుల్ బల్బు, దూరదర్శిని, చేతికర్ర, షటిల్‌బ్యాట్, మొక్కజొన్న, నగారా, దువ్వెన, మంచం, కప్పు సాసరు, కొవ్వొత్తిని కేటాయించింది.

వార్డు సభ్యులకు :

విద్యుత్ స్థంబం, గ్యాస్‌పొయ్యి, హార్మోనియం, టోపీ, ఇస్త్రీ పెట్టి, పోస్టుబాక్సు, ఫోర్క్, చెంచా, జగ్గు, గౌను, స్టూలు, బీరువా, ప్రెషర్‌కుక్కర్, ఐస్‌క్రీం, కెటిల్ గుర్తులను ఎన్నికల సంఘం కేటాయించింది.



బ్యాలెట్ పత్రం నమూనా ఇలా

సర్పంచ్ ఎన్నికల బరిలో నాడు పతి... నేడు సతి



సర్పంచ్ అభ్యర్థి బాణోతు జ్యోతి,



నాటి అభ్యర్థి బాణోతు కొండ

బోనకల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బోనకల్ గ్రామ పం చాయతీ సర్పంచ్ ఎన్నికల బరిలో నాడు పతి నిలబడగా, నేటి ఎన్నికల బరిలో సతి నిలవడం ఆసక్తికరంగా మారింది. గత పం చాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా మాజీ జడ్పీటీసీ బాణోతు కొండ పోటీచేసి స్వల్పతేడాతో పరాజయం పొందాడు. నేడు జరగనున్న ఎన్నికల్లో పంచాయతీ స్థానం జనరల్ మహిళకు రిజర్వు కావడంతో ఆయన సతీమణి జ్యోతిని బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిపారు. నామినేషన్లు వేయకముందు నుంచే విజయం సాధించేందుకు వ్యూహారచన చేస్తూ ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మరలా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సర్వశక్తులా ఒడ్డుతున్నారు. సీపీఎం నాయకులు కూడా వీరికి మద్దతు తెలపడంతో ప్రచారం హోరెత్తిస్తున్నారు.

ఓటు తిప్పలు

5 కిలో మీటర్లు నడవాల్సిందే...



ఏన్కూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏన్కూరు మండలం కొత్త మేడేపల్లి గిరిజనులకు ఓటు తిప్పలు తప్పడం లేదు. దశాబ్ద కాలం నుంచి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంట్ ప్రతి ఎన్నికల్లో దూరప్రాంతానికి వెళ్లి ఓటుహక్కు వినియోగించడానికి నానా తిప్పలు పడుతున్నారు. 5 కి.మీ. దూరంలో ఉన్న మేడేపల్లికి వాగులు, వంకలు దాటి కాలినడకన వెళ్లాల్సి వస్తుంది. అదేవిధంగా ప్రతినెల రేషన్ బియ్యం తీసుకురావడానికి కూడా మేడేపల్లి వెళ్లి రావడానికి ఇబ్బంది పడుతున్నారు. సుమారు 18ఏళ్ల క్రితం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి 60 కుటుంబాలు వలసవచ్చి కొత్తమేడేపల్లి అటవీ సమీపంలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఈ గ్రామంలో సుమారు 130 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఓట్లు మేడేపల్లి పంచాయతీలో ఉన్నాయి. కానీ ఈ గ్రామానికి సరైన రహదారి, విద్యుత్‌సౌకర్యం లేదు. గుడ్డి దీపాల మధ్యనే జీవిస్తున్నారు. విద్యుత్, రహదారి, రేషన్‌డిపోతో పాటు గ్రామంలోనే పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

సర్పంచ్ అభ్యర్థులకు గులాబీ.. వార్డు సభ్యులకు తెలుపు రంగు
బ్యాలెట్ పత్రాల ముద్రణ పూర్తి

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ సమరంలో పోటీ చేసే అభ్యర్థులకు గుర్తులు కాస్త గందరగోళంగా ఉన్నా.. బ్యాలెట్ పేపర్లు మాత్రం గ్రామీణ ప్రాంతాల ప్రజలు గుర్తించేలా ముద్రించారు. గతంలో నిత్యం చూసే రేషన్‌కార్డు రంగుల్లోనే బ్యాలెట్ పత్రాలు ఉన్నాయి. దీంతో పోటీదారులు గుబులు చెందాల్సిన అవసరంలేదు. సర్పంచ్ అభ్యర్థులకు గులాబి రంగులో, వార్డు సభ్యులకు తెలుపు రంగులో బ్యాలెట్ పత్రాలను ముద్రించారు.

- జిల్లాలో 8లక్షల 65 వేలు సర్పంచ్ బ్యాలెట్ పత్రాలు అవసరం ఉండగా 10శాతం అదనంగా అంటే 86500 కలిపి మొత్తం 9,51,500 పత్రాలను సిద్ధం చేశారు. వీటిలో రెండు గుర్తులతో 95,150, మూడు గుర్తులతో (2+నోటా) 1,61,755 పత్రాలు ముద్రించారు. అలాగే

4 గుర్తులతో (3+నోటా) 2,37,875,
5 గుర్తులతో (4+నోటా) 1,61,755,
6 గుర్తులతో (5+నోటా) 1,04,665,
7 గుర్తులతో (6+నోటా) 76,120,
8 గుర్తులతో (7+నోటా) 38,060,
9 గుర్తులతో (8+నోటా) 28,545,
10 గుర్తులతో (9+నోటా) 19,030,
11 గుర్తులతో (10+నోటా) 9,515,
12 గుర్తులతో (11+నోటా) 6,185,
13 గుర్తులతో (12+నోటా) 4,758,
14 గుర్తులతో (13+నోటా) 2,855,
15 గుర్తులతో (14+నోటా) 1,903,
16 గుర్తులతో (15+నోటా) 1,427,
17 గుర్తులతో (16+నోటా) 952,
18 గుర్తులతో (17+నోటా) 476,
19 గుర్తులతో (18+నోటా) 285,
20 గుర్తులతో (19+నోటా) 190 ముద్రించి సిద్ధంగా ఉంచారు.

- వార్డు సభ్యులకు గాను 9,51,500 తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలను



సిద్ధంచేశారు. వీటిలో 2 గుర్తులతో 1,90,300, 3 గుర్తులతో (2+నోటా) 2,85,450, 4 గుర్తులతో (3+నోటా) 1,90,300, 5 గుర్తులతో (4+నోటా) 1,42,725, 6 గుర్తులతో (5+నోటా) 95,150, 7 గుర్తులతో (7+నోటా) 47,575 బ్యాలెట్ పత్రాలను అధికారులు ముద్రించి సిద్ధం చేశారు.

తెలంగాణ ఎక్సైజ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా రామ్‌ప్రసాద్, కార్యదర్శిగా శేఖర్

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా శుక్రవారం ఖమ్మంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బీ.రామ్‌ప్రసాద్(ఇల్లెందు), ప్రధాన కార్యదర్శిగా ఎం.శేఖర్,(సత్తుపల్లి), కోశాధికారిగా ఎం.ప్రసాద్(పాల్వంచ), ఉపాధ్యక్షులుగా ఎం.ప్రశాంతి(సింగరేణి), గౌరవ అధ్యక్షుడిగా డి.జనార్దన్ డిప్యూటీ కమిషనర్‌ను ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షులుగా జే.రమేశ్(కొత్తగూడెం), జాయింట్ కార్యదర్శిగా ఎస్.రమేశ్(నేలకొండపల్లి), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డీ.వసంతలక్ష్మీ (సింగరేణి), ఈసీ సభ్యులుగా ఎస్‌కే రహీమున్నీసా (భద్రాచలం), ఎస్.జయశ్రీ(ఖమ్మం), సీహెచ్.శ్రీహరిరావు(కొత్తగూడెం), ఎం.సాయిరామ్(వైరా) ఎన్నుకున్నారు. అనంతరం మర్యాదపూర్వకంగా ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో రూ.1.48 కోట్లు గల్లంతు

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధిత వ్యక్తి - కేసు నమోదు

భద్రాచలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంకు చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టి రూ.1,48,79,000 కోట్లు పోగొట్టుకున్న సంఘటన ఇది. భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంకు చెందిన వ్యక్తి ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ మహిళ మాటలు నమ్మి పలు దఫాలుగా పెట్టుబడులు పెట్టాడు. అనంతరం ఆ సొమ్ము తిరిగి రాకపోవడంతో ఆ మహిళ తనను మోసం చేసిందని గుర్తించారు. దీంతో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. అలాగే సైబర్ క్రైం పోలీసులకు సైతం ఫిర్యాదు చేయడంతో సదరు వ్యక్తి ఇచ్చిన ఖాతాలను పరిశీలించి రూ.7,58,000లను హోల్డ్‌లో పెట్టారు. అలాగే ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ సైబర్ నేరాలకు సంబంధించి కేసులు నమోదవుతున్నాయని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా బెట్టింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ ట్రేడింగ్, లోన్‌యాప్‌లు, కేవైసీ అప్‌డేట్, ఏపీకే ఫైల్స్ ఇన్‌స్టాల్ చేసుకోవద్దన్నారు. సైబర్ దాడులకు గురైతే వెంటనే 1930కు ఫోను చేయడంతో పాటు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

ధాన్యం డబ్బుల కోసం వెళ్లి... శవమై తేలాడు

దుమ్ముగూడెం, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయించిన డబ్బుల కోసం వెళ్లిన ఆదివాసీ రైతు కాల్వలో శవమై తేలిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. పాత నారాయణరావుపేటకు చెందిన కూరం సమ్మయ్య (48) ఈనెల 26న సాయంత్రం పూట ధాన్యం విక్రయించిన డబ్బుల కోసం గ్రామంలోని రామకృష్ణ అనే వ్యాపారి వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి కాలినడకన ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన ఇర్పా నగేష్ అనే వ్యక్తితో కలిసి బైక్‌పై కోడిని కొనేందుకు సిరిగుండం గ్రామానికి వెళ్లారు. రెండు రోజులుగా సమ్మయ్య కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు అంతావెతికారు. కాగా ఆచూకీ కోసం నగేష్‌ను స్థానికులు ప్రశ్నించగా, సమ్మయ్యకు మద్యం ఎక్కువడంతో మధ్యలో వదిలేసి వచ్చానని సమాధానం ఇచ్చాడు. కానీ ఈనెల 28న సిరిగుండం నుంచి పి.నారాయణరావుపేటకు వెళ్లే మార్గమధ్యలో ఉన్న ఎర్రకాలవలో సమ్మయ్య శవమై తేలాడు. మృతుడి తల వెనుకభాగం రక్తస్రావమైనట్లు తెలుస్తోండగా, మృతదేహం తక్కువ లోతులో పడి ఉండ డం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా సీఐ వెంకటప్పయ్య కేసు నమోదు చేశారు.

చలిమంట అంటుకుని వృద్ధురాలి మృతి



రసూల్‌బీ (ఫైల్)

తల్లాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చలిమంట కాగుతుండగా నిప్పంటుకుని తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు శుక్రవారం మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తల్లాడమండలం రామానుజవరం గ్రామానికి చెందిన కిన్నెర వెంకమ్మ (85) మృతిచెందింది. ఈనెల 25వ తేదీ రాత్రి గ్రామంలో విద్యుత్‌సరఫరా నిలిచి పోవడంతో వెంకమ్మ చలిమంట వేసింది. ప్రమాదవశాత్తు వెంకమ్మ చీరకు నిప్పుఅంటుకుని తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కానీ పరిస్థితి విషమంలో ఉండడంతో మెరుగైన వైద్యంకోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. ఈమేరకు హెడ్‌కానిస్టేబుల్ చెన్నారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్పంచ్ రేస్‌లో 'బీటెక్' ప్రియాంక

రఘునాథపాలెంలో ఊపందుకున్న నామినేషన్లు

రఘునాథపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విద్యావంతులైన మహిళా అభ్యర్థులు మేము సైతం అంటూ ముందుకు వస్తున్నారు. చింతగుర్తి కాంగ్రెస్ సర్పంచి అభ్యర్థిగా బీటెక్ పూర్తి చేసిన తమ్మినేని ప్రియాంక శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. తమ్మినేని కుటుంబం ఎన్నో ఏళ్లుగా రాజకీయాల్లో ఉండటంతో విద్యావంతురాలైన ఈ యువతికి అవకాశం కల్పించినట్లు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు సైతం సంఘీభావం తెలిపారు. కాగా మండల వ్యాప్తంగా సర్పంచ్ పదవికై 28 నామినేషన్లు, వార్డు సభ్యులకు 57 నామినేషన్లు దాఖలయ్యాయి.



సర్పంచ్‌గా నామినేషన్ అందిస్తున్న తమ్మినేని ప్రియాంక

3న హైదరాబాద్‌లో జర్నలిస్టుల మహాధర్నా

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గల 12 ఏళ్లుగా జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడంపై నిరసన వ్యక్తం చేస్తూ డిసెంబరు 3న హైదరాబాదులోని మసాబ్‌ట్యాంక్ వద్ద రాష్ట్ర సమాచారశాఖ కార్యాలయం ఎదుట టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి కట్టెకోల రాంనారాయణ తెలిపారు. ఈ మేరకు ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పుష్కరకాలంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండళ్లవుతున్నా మాటలతో కాలం గడుపుతూ జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రుల్లో సమాచారశాఖ మంత్రి ఉన్నాగానీ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం విషయంలో మాటలకే పరిమితం అయ్యారని వాపోయారు. జర్నలిస్టుల సమస్యలైన అక్రిడేషన్ కార్డుల మంజూరు, హెల్త్‌కార్డుల పంపిణీ, ఇంటిస్థలాలు కేటాయింపు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు ఖమ్మంజిల్లా నుంచి అధికసంఖ్యలో జర్నలిస్టులు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా మహాధర్నా పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సామినేని మురారి, నర్వనేని వెంకటరావు, జిల్లాఅధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు, కార్యదర్శి మైసా పాపారావు, మాజీ జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల భూపాల్, మహేందర్, నగర కమిటీ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కె.రాంనారాయణ

కొండరెడ్ల సంక్షేమానికి ఐటీడీఏ ప్రత్యేక శ్రద్ధ

ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్

దమ్మపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతంలో నివసించే కొండరెడ్ల కుటుంబాను అభివృద్ధి తీసుకురావటానికి ఐటీడీఏ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, కొండరెడ్లకు అందించే అన్ని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్‌రాజ్ అన్నారు. మండలంలోని కొండరెడ్ల గ్రామం పూసుకుంటను శుక్రవారం ఐటీడీఏ అధికారులు సందర్శించారు. కొండరెడ్లకు అందించిన సోలార్‌లైట్లను, పామాయిల్ తోటలను పరిశీలించారు. పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. అనంతరం కొండరెడ్లతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏపీవో డేవిడ్‌రాజు మాట్లాడుతూ కొండరెడ్ల జీవనోపాధికి అందిస్తున్న అన్ని వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయిల్‌ఫామ్‌లో అంతర పంటలు వేసుకుని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన ఆరు డీటీఆర్‌లను త్వరలో అందిస్తామని తెలిపారు. రైతులకు రెండురోజుల్లో మోటార్లు ఇస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు ప్రక్రియను సోమవారం నాటికి పూర్తి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్, ఏపీవో పవర్ వేణు, ఇతర శాఖల ఉన్నతాధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్ రాజు

మున్నేరు వంతెనపై ట్రాఫిక్ ఆంక్షలు

నేడు పాతబ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేత

ఖమ్మంక్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరలోని కాల్వొడ్డు మున్నేరుపై తీగల వంతెన నిర్మాణంలో భాగంగా భారీ యంత్రాలతో చేపడుతున్న పనుల నేపథ్యంలో పాతబ్రిడ్జిపై ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాతబ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేస్తున్నామని తెలిపారు. ప్రజలు గమనించి ఆయా సమయాల్లో ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని కోరారు.

కోడిపందాల స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడి

వేంసూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోడిపందాల స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసిన ఘటన వేంసూరు మండలం పల్లెవాడలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పల్లెవాడ సమీపంలో కోడిపందాలు వేస్తున్నారనే సమాచారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేయగా ఇద్దరిని అదుపులోకి తీసుకోగా మరో ఏడుగురు పరారైనట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఈదాడిలో 8 ద్విచక్రవాహనాలు, మూడు సెల్‌ఫోన్లు, మూడు పుంజులను స్వాధీనంతీసుకొని వేంసూరు పోలీసులకు అప్పగించారు.

30 మందిపై బైండోవర్ కేసులు

తల్లాడ, నవంబరు28 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా తల్లాడ మండలంలో శుక్రవారం 30 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. గతంలో ఎన్నికల సందర్భంగా గొడవలకు పాల్పడిన వారితో పాటు బెల్టు షాపుల నిర్వాహకులపై ఎస్ఐ వెంకటేష్ బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ కార్యాలయంలో హాజరుపరిచారు. తల్లాడలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు.

పింఛను కోసం వెళ్తూ అనంత లోకాలకు..

ఆటోలో నుంచి పడి వృద్ధురాలి మృతి

ఖమ్మం జిల్లా పాతలింగాల స్టేజీ వద్ద ఘటన

కామేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య పింఛను కోసం వెళ్తూ ఓ వృద్ధురాలు రోడ్డుప్రమాదానికి గురై మృతిచెందిన ఘటన కామేపల్లి మండలం పాతలింగాల స్టేజీ సమీపంలో శుక్రవారం జరిగింది. ఈ విషాద ఘటనకు సంబంధించిన వివరాలివీ.. కామేపల్లి మండలంలోని సాతానుగూడెం గ్రామానికి చెందిన షేక్ రసూల్‌బీ (84) తన బ్యాంకు ఖాతాలో జమ అయిన పింఛను సొమ్మును తీసుకునేందుకు తాళ్లగూడెంలోని ఎస్‌బీఐ బ్యాంకుకు వెళ్లేందుకు ముచ్చర్ల క్రాస్‌రోడ్ వద్ద ఓ ఆటోఎక్కింది. ఈ క్రమంలో ఆటో పాతలింగాల స్టేజీ సమీపంలోకి రాగానే ఆటోముందు వెళ్తున్న ఓ బొలేరో వాహనం ఒక్కసారి యూటర్న్ తీసుకోవడంతో ఆటోడ్రైవర్ సడెన్ బ్రేక్‌వేశాడు. దీంతో ఆటోలో కూర్చున్న రసూల్‌బీ కిందపడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108లో ఖమ్మం సర్వజన ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్సపొందుతూ సాయంత్రం మృతి చెందింది. రసూల్‌బీకి భర్త, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు.



పరీక్ష కీపై 6లోపు అభ్యంతరాలు తెలపాలి: డీఈవో

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ 8వతరగతి పరీక్ష కీపై అభ్యంతరాలు ఉంటే డిసెంబరు6లోపు సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ వెబ్సైట్‌లో కీ అందుబాటులో ఉందని, అభ్యంతరాలుంటే డైరెక్టర్ ప్రభుత్వ పరీక్షలు, తెలంగాణ, హైదరాబాద్ వారికి నేరుగా సమర్పించవచ్చని పేర్కొన్నారు. డిసెంబరు6 తర్వాత వచ్చే అభ్యంతరాలు పరిశీలించబడవని డీఈఓ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

కేఎంసీలో బిల్ కలెక్టర్ల కొరత

- వార్డు ఆఫీసర్లపై అదనపు భారం
- ప్రధాన పథకాల అమలులో జాప్యం
- అదనపు ఉద్యోగుల వినియోగం పట్టని అధికారులు



ఖమ్మంకార్పొరేషన్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో గతంలో పనిచేసిన రెవెన్యూ కార్యదర్శిలు, గ్రామరెవెన్యూ సహాయకులు తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. దాంతో ఖమ్మం నగరంలో బిల్‌కలెక్టర్ల కొరత ఏర్పడింది. ప్రతీ నెలా రావాల్సిన ఆదాయ వసూళ్లపై ప్రభావం పడింది. అయితే క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, సిబ్బంది కొరత ఏర్పడినా ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో తిష్టవేసిన ఉద్యోగుల్ని మాత్రం డివిజన్లుకు పంపక పోవటంతో పలు సంక్షేమ,అభివృద్ధి పథకాలతో పాటుగా రెవెన్యూ వసూళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

పనిభారంతో వార్డు ఆఫీసర్లు

గ్రూప్4 ద్వారా కేఎంసీకి మొత్తం 38మంది వార్డు ఆఫీసర్లు ఉద్యోగంలో చేరారు. వారిలో ముగ్గురు గ్రూప్1 పరీక్షలు రాసి ఇతర జిల్లాలకు వెళ్లారు. 35మంది వార్డు ఆఫీసర్లు కేఎంసీలో విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కోవార్డు ఆఫీసర్‌కు రెండు సాధారణ డివిజన్లుతో పాటుగా రెండు రెవెన్యూ బ్లాక్‌లు కేటాయించారు. దీంతో కొంతమంది వార్డు ఆఫీసర్లుకు ఐదు డివిజన్లు పరిధి మేరకు బాధ్యతలు పెరిగాయి. ప్రస్తుతం ఎంతో కీలకమైన ఇందిరమ్మ ఇళ్లు, ట్రేడ్ లైసెన్స్, ట్యాక్స్ కలెక్షన్, పింఛన్ వెరిఫికేషన్, ఎల్ఆర్ఎస్ పరిశీలన, రెవెన్యూ ఇంటి నెంబర్లు కేటాయింపు, పేర్లు మార్పులు చేర్పులతో పాటుగా రెవెన్యూ ట్యాక్స్ కలెక్షన్ రోజువారీ లక్ష్యాలను ఇచ్చారు. ఇలా అనేక పనులతో వార్డు ఆఫీసర్లు సతమతం అవుతున్నారు.

జాప్యం జరుగుతున్న కీలకమైన పథకాలు

రాష్ట్రప్రభుత్వం ఇందిరమ్మఇళ్ల నిర్మాణం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొంది. జిల్లా వ్యాప్తంగా వేగంగా అమలు జరుగుతున్న నగరంలో మాత్రం ఆమేరకు పురోగతి కనిపించటంలేదు.వార్డుఆఫీసర్లు పూర్తిస్థాయిలో ఇందిరమ్మఇళ్లపై దృష్టి సారించేందుకు సమ యం సరిపోవటం లేదు.అలాగే ట్రేడ్‌లైసెన్స్‌లు, పింఛన్ వెరిఫికేషన్‌కు దరఖాస్తుదారులు, కార్పొరేటర్లు పదేపదే ఫోన్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎల్ఆర్ఎస్, ట్యాక్స్ కలెక్షన్, ట్రేడ్‌లైసెన్స్‌లు వేగంగా ముందుకు వెళ్లలేక పోతున్నాయి.

అవసరానికి మించి

ఖమ్మం నగర పాలక సంస్థలో అవసరానికి మించిన స్థాయిలో రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుఉన్నారని చర్చ జరుగుతుంది. ప్రజాపాలన, మున్నేరుకు వరదలు వంటి ప్రత్యేక పరిస్థితుల్లో వచ్చే దరకాస్తులను స్వీకరించేందుకు ప్రజాపాలన, ఆసరా, రెవెన్యూ, ప్రజావాణి విభాగాలను ఏర్పాటు చేసి 15 మందికి పైగా ఉద్యోగులను కేటాయించారు. అయితే రెండునెలలుగా చేపట్టిన ప్రజావాణి స్పెషల్ డ్రైవ్‌లో 250వరకు వినతులు పరిష్కారం జరిగాయి. ఇప్పుడు సోమవారం నిర్వహించే ప్రజావాణికి దరఖాస్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. కానీ మూడు విభాగాల్లోని ఉద్యోగులు మాత్రం అదే విభాగాల్లో కొనసాగిస్తున్నారు. పెద్దగా పని లేక పోవటంతో ఇతర విభాగాలకు వెళ్లి అక్కడ వారితో వర్గపోరు చర్చలు జరుపుతున్నారని విమర్శలు వెలువడుతున్నాయి. అదేవిధంగా ఇంజనీరింగ్ విభాగంలోను వర్క్‌ఇన్స్‌పెక్టర్లుకు ఇప్పుడు పెద్దగా పనులు లేవని తెలుస్తోంది. ఎకౌంట్స్, ఆడిట్ విభాగాల్లోను క్షేత్రస్థాయిలో బాధ్యతలు నిర్వహించాల్సిన సిబ్బంది అధికారుల వద్ద అవసరాలకు మించి ఉన్నారు. ఇలా కేఎంసీ కార్యాలయంలో అదనపు సిబ్బందిని వార్డు ఆఫీసర్లుకు సహాయకులుగా లేదా బిల్‌కలెక్టర్లుగా క్షేత్రస్థాయిలోకి పంపితే ఆదాయం సమకూరటంతో పాటు బిల్ కలెక్టర్లుకు పనిభారం తగ్గుతుంది.

ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి

ఎన్నికల పరిశీలకుడు ఖర్తడే

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా వచ్చే ప్రతీ ఫిర్యాదు నమోదు కావాలి... తీసుకున్న చర్య నమోదు కావాలని ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుధామరావు అన్నారు. ఎన్నికల విధులను అధికారులు ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని ఆయన అన్నారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, ఎంసీఎంసీసెల్, మీడియా సెంటర్లను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్‌దత్‌లతో కలిసి పరిశీలించారు. 1077 టోల్‌ఫ్రీ నెంబర్, సామాజిక మాధ్యమాలలో, ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ నుంచి వచ్చే ఫిర్యాదులను బృందాలకు తెలియజేసి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికలకు సంబంధించి నిరంతరం పర్యవేక్షణ జరగాలని, సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టిసారించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లాగ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య,డీపీవోఆశాలత, డీపీఆర్ఓ ఎం.ఏ. గౌస్, ఎంసీఎంసీ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణ పరిశీలన

ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ నిబంధనల ప్రకారం పనిచేయాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామరావు అన్నారు. శుక్రవారం రఘునాథపాలెం మండలంలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్‌దత్‌తో కలిసి ఆయన పరిశీలించారు. చిమ్మపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కోటపాడు, చిమ్మపూడి, కోయచెలక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రేగులచెలక, కోయచెలక, శివాయిగూడెం గ్రామాల నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేశారు. అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ ప్రతాలను పరిశీలించారు. ఎన్నికల విధులు, బాధ్యతల పట్ల సంబంధిత అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. సాధారణ ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్‌వెంట రఘునాథపాలెం మండల తహసీల్దారు శ్వేత, లింగనాయక్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కంట్రోల్‌రూంను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు ఖర్తడే

వచ్చేనెల 28న జూబ్లీక్లబ్ ఎన్నికలు

ఖమ్మంస్పోర్ట్స్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): నగరంలోని జూబ్లీక్లబ్ ఎన్నికలు డిసెంబరు 28న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు మారగాని శ్రీనివాసరావు, యడ్లపల్లి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-27సవంత్సరాలకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు వారు తెలిపారు. శనివారం ఓటర్ల జాబితా ప్రకటన, డిసెంబరు6న నామినేషన్ల స్వీకరణ, అదే రోజు పరిశీలన, 8న నామినేషన్ల ఉపసంహరణతో పాటు పోటీదారుల తుది జాబితా ప్రకటన ఉంటుందని తెలిపారు. 28న ఉదయం7గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, 6 గంటల నుంచి లెక్కింపు, అదేరోజు ఫలితాల ప్రకటన ఉంటుందని పేర్కొన్నారు. 2827 మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారని వారు తెలిపారు. రెండు సంవత్సరాల పదవీకాలం కలిగిన జూబ్లీక్లబ్ కార్యవర్గంలో కార్యదర్శి, సంయుక్త కార్యదర్శితో పాటు 7మంది కార్యవర్గ సభ్యులు పదవిలో ఉంటారని తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఖమ్మంకార్పొరేషన్,నవంబరు28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్సీ బాలుర-బీ వసతిగృహంలో శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.వైద్యాధికారి చైతన్య, తెలంగాణ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు కొటపాటి రుక్మారావు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పెంపు

ఖమ్మంఖానాపురంహవేలి,నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్మీడియట్‌ల్లో చేరేందుకు అడ్మిషన్ల గడువును అపరాధ రుసుంతో పొడిగించామని జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కూరపాటి మంగపతిరావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల29నుంచి డిసెంబరు7 వరకు అడ్మిషన్ల గడువును పొడిగించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8008403522 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నగర అధ్యక్షుడు



ఖమ్మంకార్పొరేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ఏఐసీసీ ప్రకటించిన జాబితాలో నాగండ్లకు ఖమ్మం నగర అధ్యక్షుడిగా ఎన్నిక చేయటం తెలిసిందే.. ఈ నేపథ్యంలో ఆయన్ను కలిశారు. పార్టీ పరిస్థితిని వివరించారు.

ఐద్వా జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ఖమ్మంఅర్బన్ నవంబరు28 (ఆంధ్రజ్యోతి): జనవరి 25 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో జరిగే అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్‌లో జరిగిన ఐద్వా జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. మహిళా చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించాలన్నారు. మెరుగు వెంకటరమణ అధ్యక్షతన జరిగినసభలో రాష్ట్రకోశాధికారి మాచర్ల భారతి, జిల్లాకార్యదర్శి బండి పద్మ, జిల్లా నాయకులు పి.సులోచన,ఎండీ కరీమున్నీసా పాల్గొన్నారు.

అన్ని గ్రామపంచాయతీల్లో పోటీ చేస్తాం

టీడీపీ పాలేరు నియోజకవర్గ బాధ్యుడు కొండబాల కరుణాకర్



మాట్లాడుతున్న కొండబాల కరుణాకర్

ఖమ్మంరూరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామపంచాయతీల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేస్తుందని టీడీపీ పాలేరు నియోజకవర్గ బాధ్యుడు కొండబాల కరుణాకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నాయుడుపేటలో శుక్రవారం టీడీపీ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాల మాట్లాడుతు నియోజకవర్గంలో కలిసివచ్చే పార్టీలతో పొత్తులు పెట్టుకుని పోటీ చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, వెంకటేశ్ చౌదరి, రామారావు, అప్పి రెడ్డి, సత్యనారాయణ, గోపి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లి: ఖమ్మం జిల్లాల్లో జరిగే పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ పార్టీ మెజారిటి స్థానాల్లో పోటీ చేస్తుందని ట జిల్లా ఉపాధ్యక్షుడు కొండబాల కరుణాకర్, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జాస్తిపల్లి గ్రామంలో టీడీపీ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఏ అభ్యర్థిని పార్టీ పరంగా నిలిపినా పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో గ్రామ అధ్యక్షుడు దేవండ్ల రాంబాబు, మండల అధ్యక్షుడు పుచ్చకాయల సత్యనారాయణ, నాయకులు నాగర్జునపు శ్రీనివాస్, మల్లెంపాటి లహరిన్, నల్లమోతు సత్యనారాయణ, గొర్రె నాగయ్య, గొర్రెపాటి రామయ్య, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక స్థానాలు గెలుస్తాం

పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కందాళ

ఖమ్మంరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజవకర్గంలో బీఆర్ఎస్, సీపీఎం పొత్తులో అత్యధిక స్థానాలు గెలుస్తామని పాలేరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, సీపీఎం పాలేరు ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. మండల పరిధిలోని మారెమ్మ ఆలయం ప్రాంతంలోని ఓ ఫంక్షన్‌హాల్లో శుక్రవారం బీఆర్ఎస్, సీపీఎం కార్యకర్తల సమావేశం జరిగింది. రూరల్ మండలంలో 21 పంచాయతీల్లో 17 పంచాయతీలలో బీఆర్ఎస్, 4 పంచాయతీలలో సీపీఎం పోటీ చేస్తుందన్నారు. గ్రామాల్లో కార్యకర్తలు సమన్వయం చేసుకుని అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు ఊరడి సుదర్శన్ రెడ్డి, బెల్లం వేణుగోపాల్, మాజీ జెడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ దరగయ్య, సీపీఎం నాయకులు నండ్రా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఎస్ఐ కూసుపూడి జగదీష్

తిరుమలాయపాలెం, నవంబరు28(ఆంధ్రజ్యోతి): విధినిర్వాహణలో పోలీసులు చేపట్టే చర్యలకు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని తిరుమలాయపాలెం ఎస్ఐ కూసుపూడి జగదీష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో అల్లర్లు సృష్టించే వారిపై ప్రత్యేకనిఘా ఏర్పాటు చేశామన్నారు.సమస్యాత్మకగ్రామాలైన పిండిప్రోలు,కొక్కిరేణి, తెట్టెలపాడు, బీరోలు, మేడిదపల్లి, కాకరవాయి, జల్లేపల్లి, హైదరసాయిపేట, ఎర్రగడ్డ తదితర గ్రామాల్లో ఎన్నికలపై అవగాహన ఏర్పాటు చేశామన్నారు.

ముడిసరుకు లేక...

(5వ పేజీ తరువాయి)

ఇళ్లతో పాటు వివిధ ప్రభుత్వ భవనాలకు భూములు కేటాయించిన కారణంగా వందల సంఖ్యలో గ్రానైట్ క్వారీలకు అనుమతులు రద్దుచేసింది. క్వారీ లీజుల విషయంలో కూడా ప్రభుత్వం నిబంధనలతోపాటు పర్యావరణ అనుమతులను తప్పనిసరి చేస్తూ జీవోలు తీసుకురావడంతో క్వారీ లీజులు ఏళ్లతరబడి దరఖాస్తుల దశలోనే మిగిలిపోతున్నాయి. గతంలో గ్రానైట్ క్వారీలకు పర్యావరణ అనుమతులతో సంబంధం లేకుండానే లీజులు ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం క్వారీలకు కూడా పర్యావరణ అనుమతులు తప్పనిసరి చేయడంతో యజమానులు అనుమతుల కోసం ఏళ్ల కొద్ది వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా దరఖాస్తు చేసుకున్న ఆరునెలలోపు గ్రానైట్ క్వారీలకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని కోరుతున్నారు. అ యితే కొన్ని క్వారీలకు సమీపంలో పురాతన గుడులు ఉండటం, ఆ ప్రభావం క్వారీలపై పడింది.

ఖమ్మం రూరల్ మండలంలోని పోలేపల్లి గ్రామం. నేలకొండపల్లి మండలం మండ్రాజుపల్లి గ్రానైట్ క్వారీల్లో ఇంకా పదేళ్లకు సరిపడా నాణ్యమైన గ్రానైట్ రాళ్ల నిల్వలున్నాయి. అయినా ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో క్వారీలు నడపడం లేదు. ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామం మారెమ్మ గుడి ఎదురుగా ఉన్న ఓ గ్రానైట్ క్వారీకి సంబంధించి ప్రస్తుతం లీజులో నడుస్తున్నా దానికి ఆనుకుని ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇవ్వడంతో రానున్న రోజుల్లో ఈ క్వారీ గ్రానైట్ రాళ్లను వెలికితీసేందుకు ఇబ్బందులు తప్పవని గ్రానైట్ క్వారీ యజమానులు ఆందోళన చెందుతున్నారు. అలాగే గుర్రాలపాడు ప్రాంతంలో లీజులో నడుస్తున్న క్వారీ వెంట ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వడంతో క్వారీకి ఆనుకుని గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. దీంతో క్వారీ నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో గ్రానైట్ నిల్వలు పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లో వివిధ ప్రార్థనా మందిరాలు ఏర్పాటు కావడంతో తవ్వకాలు జరగడం లేదు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి విలువైన గ్రానైట్‌ను వెలికి తీసేలా క్వారీలకు అనుమతివ్వాలని, అందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది. లీజులను సరళీకృతం చేసి ఐదు హెక్టార్ల వరకు గతంలో ఇచ్చినట్లు (పర్యావరణ అనుమతులతో సంబంధం లేకుండా) ఇవ్వాలని, చిన్నచిన్న నల్లరాయి గుట్టలకు టెంపర్వరీ పర్మిట్లు (టీపీలు) మంజూరు చేసి గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని పరిశ్రమ యజమానులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రైవేటు ఆస్పత్రులలో డీఎంహెచ్‌వో తనిఖీ

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ప్రైవేటు ఆస్పత్రులను శుక్రవారం జిల్లా వైద్యాధికారి రామారావు ఆకస్మిక తనిఖీలు చేశారు. బాలాజీ నగర్‌లోని సాయి డెంటినోవా హాస్పటల్, శ్రీ వెంకటేశ్వర క్లినిక్‌లను తనిఖీ చేశారు. క్లీనికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ నియమ, నిబంధనల ప్రకారం ఆసుపత్రుల నిర్వహణ ఉందా, లేదా పరిశీలించారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ సక్రమంగా నిర్వహించాలన్నారు. హాస్పిటల్ జిల్లా రిజిస్ట్రేషన్ సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల అడ్డగింత

ఖమ్మంఅర్బన్ నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనులు నిలుపు చేయాలంటూ ఖమ్మంలో శుక్రవారం సీపీఎం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. స్థానిక త్రీటౌన్‌లోని పత్తి మార్కెట్ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు ఇటీవల చేపట్టారు. నాలుగు రోజులుగా కూల్చివేతలకు పూనుకున్నారు. స్థానికంగా సుందరయ్య నగర్ ప్రాంతంలోని రోడ్డు ఇప్పటికే 40 అడుగులు ఉండగా దానిని 70 అడుగులకు చేయటాన్ని తీవ్రంగా ఖండించిన సీపీఎం బాధితుల తరుపున పోరాటం నిర్వహిస్తోంది. ఆందోళనలో భాగంగా సీపీఎం నాయకులు శుక్రవారం రోడ్డు విస్తరణ ప్రాంతంలో పాదయాత్ర జరుపుతుండగా అదే సమయంలో బుల్డోజర్, ప్రొక్లైన్‌లతో ఇళ్ల కూల్చివేతలకు పూనుకోబోతుండగా అక్కడే ఉన్న సీపీఎం నాయకులు కూల్చివేతలను అడ్డుకున్నారు. రోడ్డు విస్తరణ పనులకు అడ్డ తగులుతూ ఆందోళన చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు యర్రాశ్రీనివాసరావు, త్రీటౌన్ కార్యదర్శి భూక్యాశ్రీనివాసరావు, యర్రారంజిత్, సారంగి పాపారావు, తదితర బాధితులను అరెస్టుచేశారు. స్థానిక కాంగ్రెస్ కార్పొరేటర్లు కమిషన్ల కక్కుర్తితోనే అవసరం లేక పోయినా రోడ్డువిస్తరణకు ప్రతిపాదించారని సీపీఎం నాయకులు ఆరోపించారు. త్రీటౌన్‌లోని పత్తి మార్కెట్ నుంచి ఎఫ్‌సీఐ గోదాములవైపు వెళ్లే ప్రాంతంలో 17,27,28,29,30 డివిజన్లపరిధిలో రోడ్డుఇప్పటికే40 అడుగులు ఉండగా దానిని 70 నుంచి80 అడుగులకు పెంచుతామని స్థానిక కార్పొరేటర్లు స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు.

'ఏదులాపురాన్ని మరో లగచర్ల చేయొద్దు'

ఖమ్మంరూరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఎంతో ప్రశాంతంగా ఉన్న ఏదులాపురం మునిసిపాలిటీ ప్రాంతాన్ని మరో లగచర్లగా తయారు చేయవద్దని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్రఅధ్యక్షుడు రాజేష్ నాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సర్వేనంబర్ 136 లో గిరిజన రైతులకు కేటాయించిన రెండు ఎకరాల అసైన్డ్ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో బాధిత రైతులు బానోతు కృష్ణ, రాంమూర్తి తరుపున గిరిజన సంఘాల నాయకులు శుక్రవారం ఆ భూమిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు ధర్మసోతు దశరథ నాయక్; రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అజ్మీరా సుశీలబాయి, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి గుగులోతు కుష నాయక్, తేజావత్ కృష్ణ నాయక్, జిల్లా సేవాలాల్ అధ్యక్షుడు నెహ్రూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పనులు ధ్వంసం చేసిన ఘటనపై కేసు నమోదు

ఖమ్మం క్రైం, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): ఇంటి పనులను ధ్వంసం చేసిన ఘటనపై ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్ లో శుక్రవారం కేసు నమోదైంది. నగరంలోని న్యాయవాది రామచంద్రయ్య అనే వ్యక్తి కవిరాజ్‌నగర్‌లో ఇంటిని నిర్మించుకుంటున్నాడు. సుమారు 20 మంది వ్యక్తులు నిర్మాణపనుల అడ్డగించి నిర్మించిన ఇంటి పనులను ధ్వంసంచేశారు. దీంతో బాధితుని ఫిర్యాదు మేరకు ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్ నందు కేసునమోదైంది.

ఫిలా టెలీఎగ్జిబిషన్‌ను తిలకించిన 'స్మార్ట్ కిడ్జ్' చిన్నారులు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ కిడ్జ్ పాఠశాల చిన్నారులు నగరంలోని ఎన్ఎస్పీ కాలనీలో ఉన్న డీబీఆర్సీ భవన్‌లో ఏర్పాటు చేసిన ఫిలా టెలిఎగ్జిబిషన్‌ను శుక్రవారం తిలకించారు. ప్రాచీన పోస్టల్ స్టాంప్‌ల సేకరణను, ప్రాచీననాణేలు, ప్రస్తుత నాణేలను విద్యార్థులు ఆసక్తిగా గమనించారు. పోస్ట్ కార్డులను, ఎన్వలప్ కవర్లను పరిశీలించారు. అందుబాటులో ఉన్న పోస్టల్ స్టాంపులు, నాణేలను తిలకించి వాటి వివరాలను సేకరించారు. కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న స్మార్ట్ కిడ్జ్ చిన్నారులు

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో 'గీతాంజలి' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు28(ఆంధ్రజ్యోతి): నగరంలోని గీతాంజలి పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరచారు. ద్వితీయస్థానం సాధించారని పాఠశాల కరస్పాండెంట్ అప్పారావు, డైరెక్టర్లు పద్మ, అరుణ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ పాఠశాల నయాబజార్‌లో జరిగిన ఈటాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు నవదీప్, సంజన, ఇశ్వర్ ప్రకాష్ జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి సాధించారని తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్

యూటీఎఫ్ సమావేశాలను విజయవంతం చేయండి

నేలకొండపల్లినవంబరు28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) జిల్లా సమావేశాలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి కట్టా పద్మ కోరారు. ఆదివారం ఉదయం కల్లూరులో జియాఉద్దీన్ ప్రాంగణం(ప్రభుత్వజూనియర్ కళాశాల ప్రాంగణం)లో సమావేశాలు జరుగుతాయన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ సమస్యలపై పలు తీర్మానాలు చేయనున్నట్లు పద్మ చెప్పారు. సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం నేలకొండపల్లిలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు జ్యోతి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు



ముత్తగూడెం చెక్‌పోస్టు తనిఖీ

పెనుబల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా ముత్తగూడెంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్, సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తి లింగయ్య సందర్శించి పరిశీలించారు. చెక్‌పోస్టు సిబ్బంది అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. వారి వెంట ఎస్ఐ కె.వెంకటేష్ పాల్గొన్నారు.



ముత్తగూడెం చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఏసీపీ వసుంధర యాదవ్

సీసీఐ నిబంధనలతో పత్తి రైతులకు నష్టం

తల్లాడ, నవంబరు28(ఆంధ్రజ్యోతి): సీసీఐ నిబంధనలతో పత్తిరైతులు నష్టపోతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదినేని రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక దొడ్డా కృష్ణయ్య భవనంలో కళ్యాణపు కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీసీఐ నిబంధనల వల్ల తక్కువ ధరలకు దళారులకు పత్తిని అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత నిబంధనలు ఎత్తివేసి ఎకరానికి 12 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈసమావేశంలో సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నాయకులు నల్లమోతు మోహన్‌రావు, పులి వెంకటనరసయ్య, సత్తెనపల్లి రమేష్, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు

కారేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎవరైన సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, ప్రకటనలు పోస్టులు పెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బైరు గోపి అన్నారు. శుక్రవారం పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు, పోటీలో ఉండే అభ్యర్థుల మనోభావాలు దెబ్బతినేలా ఎలాంటి ప్రకటనలు గ్రూపులలో పెట్టొద్దన్నారు. పోలీసు వారి హెచ్చారికలను దిక్కరించి పోస్టులు పెడితే వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు, కఠిన చర్యలు తీసుకుంటమన్నారు. ఈ విషయాలను గ్రూపుల అడ్మిన్లు కూడా గుర్తుంచుకోవాలన్నారు.

గుత్తాకు పోతినేని ఘన నివాళి

వైరా, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైరాలోని లీలాసుందరయ్యనగర్‌కు చెందిన ఆర్టీసీ కార్మిక నాయకుడు గుత్తా రామకృష్ణ(72)అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న కుమారుడి కోసం భౌతికకాయాన్ని ఖమ్మం మమత హాస్పిటల్‌లో భద్రపరిచి శుక్రవారం వైరాలో అంత్యక్రియలు నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదాకర్, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, పట్టణ, మండల కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, బాణాల శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ బొంతు సమత, పలువురు నాయకులు నివాళులర్పించారు.

కల్లూరు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా ప్రదీప్‌బాబు

సత్తుపల్లిరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా డాక్టర్ ఎం.ప్రదీప్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు మెడికల్ ఆఫీసర్లకు పదోన్నతులు కల్పించగా ప్రదీప్‌బాబు నల్గొండ జిల్లా తిప్పర్తి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. గతంలో కొన్నేళ్లపాటు ఇక్కడ పనిచేసిన డాక్టర్ తలారి సీతారాములుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోగా ఆ తర్వాత కొద్దిరోజుల పాటు డాక్టర్ రామారావు బాధ్యతల్లో ఉన్నారు. గత వారం డీఎంహెచ్‌ఓగా రామారావు బాధ్యతలు తీసుకోగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పోస్ట్ ఖాళీగా ఉండగా తాజాగా ప్రదీప్‌బాబు పదోన్నతిపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను నియోజకవర్గంలోని పీహెచ్‌సీ వైద్యులు ఆర్.అవినాష్, చింతా కిరణ్‌కుమార్, నవంకాంత్, రాములు, ప్రత్యూష, తబుసం, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి



మాట్లాడుతున్న ఏసీపీ తిరుపతిరెడ్డి

ముదిగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 14వతేదీ జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాతంగా జరిగేలా సహకరించాలని ముదిగొండ మండలంలోని అన్ని రాజకీయ పార్టీ నాయకులకు ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి సూచించారు. శుక్రవారం ముదిగొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన అన్ని పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో గ్రామాలను అభివృద్ధి చేసుకొనే దిశగా ఏకగ్రీవాలకు వీలైనంత వరకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఎన్నికల నియామవళిలో భాగంగా ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో, మతాలకు చెందిన ప్రదేశాల్లో రాజకీయ వేదికలు నిర్వహించవద్దని పేర్కన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మురళీ, ఎస్ఐలు గుమ్మడి హరిత, కృష్ణ ప్రసాద్, అశోక్ పాల్గొన్నారు.

తనిఖీల్లో పారదర్శకత ఉండేలా చూడాలి

కల్లూరు ఏసీపీ వసుంధర

సత్తుపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా తనిఖీలలో పారదర్శకత ఉండేలా చూడాలని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆమె సత్తుపల్లి మండలం గంగారంలోని ఎస్ఎస్‌టీ తనిఖీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. వాహనాల తనిఖీలు, సిబ్బంది పనితీరు, కేటాయింపు, వీడియోగ్రఫీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సమీక్షించారు. ఎన్నికలకు సంబంధించిన ఏవైనా ఉల్లంఘనలపై తక్షణమే స్పందించాలని అధికారులను ఆదేశించారు.సత్తుపల్లి పట్టణ సీఐ టీ.శ్రీహరి, సిబ్బంది ఉన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఏసీపీ

ఎన్నికల నియమావళి పాటించాలి

కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్



సూచనలిస్తున్న సబ్ కలెక్టర్

సత్తుపల్లిరూరల్: ఎన్నికల నియమావళి సూచనలను ప్రతిఒక్కరూ పాటించాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్ అన్నారు. శుక్రవారం సత్తుపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంతో పాటు మండలంలోని గంగారంలోని పోలింగ్ స్టేషన్, బోర్డర్ చెక్‌పోస్ట్‌లను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటువేసి ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

ఏన్కూరు ప్రభుత్వ కళాశాలలో శ్రమదానం



మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఏన్కూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులతో పాటు క్రీడా మైదానం అభివృద్ధికి కృషి చేసిన ఖమ్మం పట్టణానికి చెందిన ప్రముఖ జీర్ణకోశ నిపుణుడు డాక్టర్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు జన్మదినం సందర్భంగా శుక్రవారం కళాశాలలో శ్రమదానం చేశారు. గ్రామంలోని యువకులు, విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటారు. కళాశాలతోపాటు గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న వైద్యులు నాగేశ్వరరావును పలువురు అభినదించారు. ప్రిన్సిపాల్ ఎం.సింహాచలం, గ్రామస్తులు కె.కోటేశ్వరరావు, కె.నాగేశ్వరావు, నరేంద్రబాబు, నసీర్ పాల్గొన్నారు.

రేపు వైరాలో ఉచిత వైద్యశిబిరం

వైరా, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైరా డాక్టర్స్ అసోసియేషన్ లయన్స్‌క్లబ్ ఆఫ్ వైరా గ్రేట్ విజన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వైరాలోని శారదా నర్సింగ్ హోమ్‌లో ఖమ్మం ప్రశాంతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ దారెల్లి కోటయ్య, లయన్స్ కంటి హాస్పిటల్ చైర్మన్ కాపా మురళీకృష్ణ తెలిపారు. ఈ శిబిరంలో ప్రజలకు అన్నిరకాల వైద్యసేవలు 30న ఉదయం 9నుంచి సాయంత్రం 3గంటల వరకు ఉచితంగా అందుబాటులో ఉంటాయన్నారు. ఈ శిబిరంలో కాలేయ, మెదడుకు సంబంధిఇంచిన వవ్యాధులు కాలేయ జబ్బులు, అర్థోపెడిక్, ఈసీజీ టుడి, ఈసీవో, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'పది'లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

కల్లూరు, మధిర డివిజన్ స్థాయిలో పది విద్యార్థులకు ప్రేరణ సదస్సు

కల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ఈ ఏడాది ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని కల్లూరు డివిజన్ వెనుకబడిన తరగుతుల సంక్షేమ శాఖ అధికారి గ్రేశమ్మ వసతి గృహాల అధికారులను కోరారు. శుక్రవారం కల్లూరు బీసీ బాలుర వసతి గృహంలో కల్లూరు, మధిర డివిజన్ పరిధిలో పది విద్యార్థులకు ప్రేరణ, అవగాహన తరగతులను నిర్వహించారు. జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ అధికారి(డిబిసిబిఓ) జ్యోతి ఆదేశాల మేరకు ఈ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక కార్యచరణ రూపొందించుకుని విద్యార్థుల కోసం సమర్థవంతంగా సేవలందించాలని సూచించారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ప్రతి బీసీ వసతి గృహంలో ఉత్తమ విద్యా బోధనకు, ఉత్తమ ఫలితాలకు గ్రూపుల వారిగా స్టడీ అవర్లు నిర్వహించి ప్రత్యేక శిక్షణ కల్పిస్తున్నట్లు గ్రేశమ్మ పేర్కొన్నారు. బీసీ జిల్లా టైని అధికారిణి శ్రీజ, ఖమ్మం బీసీ సంక్షేమ సహాయ అధికారిణి వెంగళరావు, కల్లూరు, మధిర డివిజన్ల పరిధిలో గల పలు సంక్షేమ వసతి గృహాల అధికారులు శివాని, టి వెంకటేశ్వర్లు, ప్రశాంత్, శ్రీనివాస్, కిరణ్, కరుణాకర్ పాల్గొన్నారు.



ప్రేరణ తరగతుల సదస్సులో ప్రసంగిస్తున్న గ్రేశమ్మ

వైరా వాసికి పీహెచ్‌డీ



పట్టా అందుకుంటున్న మురళీకృష్ణ

వైరా, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైరాకు చెందిన దివంగత ప్రధానోపాధ్యాయుడు ముగ్గ వెంకటేశ్వరరావు కుమారుడు ముగ్గ మురళీకృష్ణ రాజస్థాన్‌లోని కెరీర్ పాయింట్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టాను శుక్రవారం అందుకున్నారు. ఏపీలోని గుంటూరు జిల్లా నర్సరావుపేటలోని ఏఎం.రెడ్డి మెమోరియల్ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా మురళీకృష్ణ ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఆయన తాను ఎంచుకున్న కొన్ని యాంటీ-హైపర్ టెన్సివ్, యాంటీ-వైరల్ ఔషధాలు, వాటి మిశ్రమ ఔషధ మోతాదు రూపాల నిర్ధారణ కోసం విశ్లేషణాత్మక పద్ధతి, అభివృద్ధి, ధ్రువీకరణ అనే శీర్షికతో పరిశోధనను ప్రొఫెసర్లు టి.రాజకుమారి, కుమారస్వామి సంయుక్త పర్యవేక్షణలో పూర్తి చేశారు. ఈ అధ్యయనం ఔషధ విశ్లేషణలో కచ్చితమైన ప్రమాణాలను అభివృద్ధి చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని మురళీకృష్ణ తన పరిశోధనలో వివరించారు. మురళీకృష్ణను తల్లి శారదాదేవి, బంధుమిత్రులు అభినందించారు.

సింగరేణి ప్రభావిత ప్రాంతాలపై మరింత దృష్టి

కొమ్మేపల్లి పర్యటనలోఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రభావిత ప్రాంతాలపై సంస్థ మరింత దృష్టి సారించి అభివృద్ధి చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ఆర్‌అండ్‌ఆర్ అభివృద్ధి పనులలో భాగంగా సింగరేణి వారి సౌజన్యంతో రూ.16లక్షల వ్యయంతో పట్టణంలోని కొమ్మేపల్లి కాలనీలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ క్రీస్తు దేవాలయం చర్చీను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి ప్రారంభించారు.



చర్చీ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి

దక్షిణ ఇండియా సంఘం-డోర్నకల్ అధ్యక్ష మండల పరిధిలోని సత్తుపల్లి గ్రూప్, పాస్ట్రేట్-కొమ్మేపల్లి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చర్చీ ప్రారంభోత్సవానికి బిషప్ ఇన్ డోర్నకల్, కృష్ణా-గోదావరి అధ్యక్ష మండల మోడరేటర్ కమిషరీ డి.రైట్.రెవ.డా.కే.పద్మారావు, డయోసిసన్ ఉమెన్ ఫెలోషిప్, తెలుగు రీజియన్ ప్రెసిడెంట్ రెవ.డా.కే.విజయలు హాజరైనారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్, పీఓ ఎన్‌వీఆర్.ప్రహ్లాద్, మునిసిపల్ కమిషనర్ కొండ్రా నర్సింహ, స్థానిక సంఘ కాపరులు డికన్ వై.వసంత్‌కుమార్, వనజ, కాలనీ వాసులు మర్సకట్ల దేవదాసు, పచ్చినీళ్ల ఇర్మియ, బైరెడ్డి కృష్ణారెడ్డి, ఎస్‌కే.సుబానీ, పీ.శ్రీను, ఎస్‌కే.బాజీ, ఎస్‌కే.షఫీ, సింగరేణి అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖోకు ఎర్రుపాలెం విద్యార్థి



ఎర్రుపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీనవోలు గ్రామానికి చెందిన బైటపాటి శృతి రాష్ట్రస్థాయి అండర్ 14ఖోఖో పోటీలకు ఎంపికయింది. మీనవోలు జిల్లాపరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదవుతున్న శృతి ఈనెల 26న కల్లూరులో జరిగిన జిల్లాస్థాయి బాలికల ఖోఖో పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలు ఎంపికైనట్టు హెచ్‌ఎం, ఎంఈవో మురళీమోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరులో వికారాబాద్ జిల్లా తాండూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. ఉత్తమ శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు జీవీ సత్యనారాయణరెడ్డిని పలువురు అభినందించారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలను అందించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ సమావేశాన్ని జయప్రదం చేయండి

ఏన్కూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30న కల్లూరులో జరిగే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా కమిటీ విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి డీఎస్ నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఏన్కూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమావేశాలకు ముఖ్య అతిథులుగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూల వెంకట్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని, తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో విద్యారంగం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్యచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి ఉపాధ్యాయులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బానోతు రామచంద్, మూడ్ పుల్లయ్య, ఉపాధ్యక్షులు వి.శ్రీదేవి, జె.పుల్లయ్య, నాయకులు శంకరరావు, ఎం.నాగేశ్వరరావు, వర్ధీనియా, హతిరామ్, శ్రీధర్, రవికిరణ్, చంద్రప్రకాష్, శ్యాంకుమార్, బీమ్‌సింగ్, నరసింహారావు పాల్గొన్నారు.

'చెకుముకి' టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

సత్తుపల్లిరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో ఖమ్మంలోని నయాబజార్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో సత్తుపల్లి పట్టణంలోని బాలికల పాఠశాల విద్యార్థుల ప్రతిభతో ఆ పాఠశాల మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం నీరుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లాలోని 21మండలాల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయిలో పాల్గొన్నారు. మొత్తం 21మండలాల టీమ్‌లు పాల్గొనగా సత్తుపల్లి ప్రభుత్వ పాఠశాలల ఇంగ్లీష్ మీడియం విభాగంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. విజేతలు పీ.శరణ్యదత్తశ్రీ, కే.ధనవర్ష, పీ.దివ్యశ్రీలను హెచ్‌ఎంతో పాటు ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు అభినందించారు.

పెనుబల్లిలో ఈజీఎస్ ఇన్నర్ ఫోరం నిర్వహణ

పెనుబల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలో భాగంగా ఏప్రిల్ 2024నుంచి మార్చి 2025 వరకు ఈజీఎస్ ద్వారా 407పనులకు రూ.5,26,42,801తోనూ, పీఆర్ ద్వారా 46పనులకు రూ.20,94,1612, అటవీశాఖ ద్వారా ఏడు పనులకు రూ.40,32,87 సంబంధించి ఎస్ఆర్‌పీ రంజికుమార్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ అధికారుల బృందం ఈనెల 12వతేదీ నుంచి 27వతేదీ వరకు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం ఇన్నర్‌ఫోరంలో జరిమానాల రూపంలో రూ.1.22లక్షలు, రికవరీ కింద రూ.65,920 మొత్తంగా రూ.1,87,920ను పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు వీటిని విధించారు. కార్యక్రమంలో ప్రొసిడింగ్ అధికారి చలపతిరావు, క్వాలిటీ కంట్రోల్ అధికారి వీరయ్య, విజిలెన్స్ సూపరింటెండెంట్ శాస్త్రీ, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి ప్రతిభ, అసిస్టెంట్ విజిలెన్స్ మేనేజర్ పవన్‌కుమార్, ఎంపీడీవో అన్నపూర్ణ, ఏపీవో మధుసూదన్, పీఆర్ ఏఈ రమేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు పాల్గొన్నారు. ఇన్నర్ ఫోరం వలన కూలీలకు న్యాయం జరగటం లేదని, ఎన్నికల కోడ్ సందర్భాల్లో సామాజిక తనిఖీలు వాయిదా వేయాలని అధికారులను కోరారు.



ఇన్నర్ ఫోరం నిర్వహిస్తున్న అధికారులు

ముడిసరుకు లేక..

(5వ పేజీ తరువాయి)

ఇళ్లతో పాటు వివిధ ప్రభుత్వ భవనాలకు భూములు కేటాయించిన కారణంగా వందల సంఖ్యలో గ్రానైట్ క్వారీలకు అనుమతులు రద్దుచేసింది. క్వారీ లీజుల విషయంలో కూడా ప్రభుత్వం నిబంధనలతోపాటు పర్యావరణ అనుమతులను తప్పనిసరి చేస్తూ జీవోలు తీసుకురావడంతో క్వారీ లీజులు ఏళ్లతరబడి దరఖాస్తుల దశలోనే మిగిలిపోతున్నాయి. గతంలో గ్రానైట్ క్వారీలకు పర్యావరణ అనుమతులతో సంబంధం లేకుండానే లీజులు ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం క్వారీలకు కూడా పర్యావరణ అనుమతులు తప్పనిసరి చేయడంతో యజమానులు అనుమతుల కోసం ఏళ్ల కొద్ది వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా దరఖాస్తు చేసుకున్న ఆరునెలలోపు గ్రానైట్ క్వారీలకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని ఇచ్చే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అయితే కొన్ని క్వారీలకు సమీపంలో పురాతన గుడులు ఉండటం, ఆ ప్రభావం క్వారీలపై పడింది.

పలుచోట్ల నిల్వలున్నా.. అనుమతులకు నో..

ఖమ్మం రూరల్ మండలంలోని పోలేపల్లి గ్రామం. నేలకొండపల్లి మండలం మంగ్రాజుపల్లి గ్రానైట్ క్వారీల్లో ఇంకా పదేళ్లకు సరిపడా నాణ్యమైన గ్రానైట్ రాళ్ల నిల్వలున్నాయి. అయినా ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో క్వారీలు నడపడం లేదు. ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామం మారెమ్మ గుడి ఎదురుగా ఉన్న ఓ గ్రానైట్ క్వారీకి సంబంధించి ప్రస్తుతం లీజులో నడుస్తున్నా దానికి ఆనుకుని ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇవ్వడంతో రానున్న రోజుల్లో ఈ క్వారీ గ్రానైట్ రాళ్లను వెలికితీసేందుకు ఇబ్బందులు తప్పవని గ్రానైట్ క్వారీ యజమానులు ఆందోళన చెందుతున్నారు. అలాగే గుర్రాలపాడు ప్రాంతంలో లీజులో నడుస్తున్న క్వారీ వెంట ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్ల ఇవ్వడంతో క్వారీకి ఆనుకుని గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. దీంతో క్వారీ నిర్వహణ ఇబ్బంది కరంగా మారింది. దీనికి తోడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో గ్రానైట్ నిల్వలు పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లో వివిధ ప్రార్థనా మందిరాలు ఏర్పాటు కావడంతో తవ్వకాలు జరగడం లేదు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి విలువైన గ్రానైట్‌ను వెలికి తీసేలా క్వారీలకు అనుమతివ్వాలని, అందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది. లీజులను సరళీకృతం చేసి ఐదు హెక్టార్ల వరకు గతంలో ఇచ్చినట్లు (పర్యావరణ అనుమతులతో సంబంధం లేకుండా) ఇవ్వాలని, చిన్నచిన్న నల్లరాయి గుట్టలకు టెంపర్వరీ పర్మిట్లు (టీపీలు) మంజూరు చేసి గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని పరిశ్రమ యజమానులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రాంగణ నియామకాలలో మదర్‌థెరిస్సా విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కంపెనీ క్యూ-స్పైడర్స్ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో 20మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ మాట్లాడుతూ.. వివిధ విభాగాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మూడు దశల టెస్టులు ఆప్టిట్యూడ్ ఆన్‌లైన్ టెస్ట్, గ్రూప్ డిస్కసన్స్, హెచ్‌ఆర్ రౌండ్‌లలో అత్యంత ప్రతిభ కనబరిచిన 20మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వీరికి 3నెలల ఇంటర్న్‌షిప్ తర్వాత ఒకొక్కరికి రూ.3.5లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగ నియామకాలు పొందనున్నట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డా.ఎంవీ.రామచంద్రరావు, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేటర్ టీ.రాఘవరాజు, కంపనీ రీసోర్స్ పర్సన్స్ ప్రతిభ, సుప్రజలు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం